తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్టేట్ రౌండప్
STATE ROUNDUP
ప్రజాజ్యోతి తెలంగాణ    గురువారం 07-03-2024    పేజీల్-12

## 12న తెలంగాణకు హోంమంత్రి అమిత్ షా

### బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వెల్లడి

హైదరాబాద్,మార్చి6: దేశ ప్రజలే మోదీ కుటుంబ సభ్యులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. బుధవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఈనెల 12వ తేదీన తెలంగాణకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వస్తున్నారని తెలిపారు. పోలింగ్ బూత్ స్థాయి నేతల సమావేశంలో అమిత్ షా పాల్గొంటారని చెప్పారు. దేశ వ్యాప్తంగా

మిగతా 2లో..

## ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే నా తెలంగాణ ఊరుకోదు

రేవంత్ రెడ్డికి తెలంగాణ ఆత్మ లేదు..

తెలంగాణపై గౌరవం అంతకన్నా లేదు

తెలంగాణ సోయి లేనోడు సీఎం కావడం మన ఖర్మ

మోదీ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవంపై రేవంత్ దాడి చేస్తున్నాడు

### సిఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్,మార్చి6: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ఆత్మ లేదు.. తెలంగాణపై గౌరవం అంతకన్నా లేదు అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. తెలంగాణ సోయి లేనోడు సీఎం కావడం మన ఖర్మ అని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవం విలువ తెలవనోడు సీఎంగా ఉండటం మన దౌర్భాగ్యం అని విమర్శించారు. నా తెలంగాణ దేనినైనా సహిస్తుంది కానీ.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే మాత్రం ఊరుకోదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు. మోదీ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవంపై రేవంత్ దాడి చేస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. గోల్ మాల్ గుజరాత్ మోడల్‌కు, గోల్డెన్ తెలంగాణ మోడల్‌తో పోలికెక్కడిది..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఘనమైన "గంగా జెమునా తెహజీబ్ మోడల్" కన్నా.. మతం పేరిట చిచ్చు పెట్టే "గోద్రా అల్లర్ల మోడల్" నీకు నచ్చిందా..? అని నిలదీశారు. నిన్న మొన్నటి దాకా గుజరాత్ మోడల్‌పై నిప్పులు చెరిగిన రేవంత్.. ఇవాళ ప్రధాని పక్కన సీటు ఇవ్వగానే.. ఆయన గురించి గొప్పలు మాట్లాడుతున్నారు. ఇదేం నీతి.. ఇదేం రీతి.. రేవంత్ అంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. దేశం మెచ్చిన ఈ తెలంగాణ నమూనాను నమో ముందు కించ పరుస్తావా..? నమ్మి ఓటేసిన తెలంగాణపై ఎందుకీ నయవంచన? నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెడతావా..?? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు కేటీఆర్.

## జూన్ 4, 5 తేదీల్లో ఐసెట్ పరీక్ష

### తెలంగాణ ఐసెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్,మార్చి6: తెలంగాణ ఐసెట్ 2024 నోటిఫికేషన్ విడుదలైంది. 2024-25 విద్యా సంవత్సరానికిగానూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు కాకతీయ యూనివర్సిటీ తెలంగాణ ఐసెట్ షెడ్యూల్ విడుదల చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మార్చి 7వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 30 వరకు ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దరఖాస్తు సమయంలో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ కేటగిరీలకు చెందిన విద్యార్థులు రూ.500, ఇతరులు రూ.750 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవల్సి ఉంటుంది. రూ.500 అపరాధ రుసుముతో మే 27 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఐసెట్‌కు సంబంధించిన హాల్‌టికెట్లు మే 28 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో జూన్ 4, 5 తేదీల్లో ఐసెట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలంటే.. బీఏ,

మిగతా 2లో..

## లహరి ఎసి బస్సుల్లో 10శాతం రాయితీ

### ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్,మార్చి6: సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో బెర్తులపై 10 శాతం రాయితీని ప్రకటించింది. ఈ సర్వీసులు తిరిగే అన్ని రూట్లలోనూ ఈ రాయితీ వర్తిస్తుందని



సంస్థ ఎండీ సజ్జనార్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వెల్లడించారు. ఏప్రిల్ 30 వరకు డిస్కౌంట్ అమల్లో ఉంటుందని తెలిపారు. లహరి ఏసీ స్లీపర్ బస్సులు హైదరాబాద్ నుంచి చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, బెంగళూరు రూట్లలో నడుస్తుండగా.. లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ సర్వీసులు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్‌కు, గోదావరిఖని - బెంగళూరు, కరీంనగర్ - బెంగళూరు, నిజామాబాద్ - తిరుపతి, నిజామాబాద్ - బెంగళూరు, వరంగల్ - బెంగళూరు రూట్లలో అందుబాటులో ఉన్నాయి.




## ఆర్ఆర్ఆర్ చిత్రానికి మూవీ ఆఫ్ ది డికేడ్ అవార్డు

### గామా 2021 బెస్ట్ యాక్టర్‌గా అల్లు అర్జున్

### గామా 2022 బెస్ట్ యాక్టర్‌గా నిఖిల్ సిద్ధార్థ

### దుబాయ్‌లో ఘనంగా గామా అవార్డ్స్

**దుబాయ్,మార్చి6:** దుబాయ్‌లో జరిగే గామా అవార్డ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రతి ఏడాది దుబాయ్ లో %ఫాఖీవీ% ప్రాపర్టీస్ ప్రెజెంట్స్ చేసే ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఇక ఈ ఏడాది గామా తెలుగు మూవీ అవార్డ్స్ 4%ష్ట్ర% ఎడిషన్ కూడా అంగరంగ వైభవంగా జరిగింది.మార్చి 3న దుబాయ్ లోని జబిల్ పార్క్ లో గామా అవార్డ్స్ వేడుకను, గామా అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు గ్రాండ్ గా నిర్వహించారు. టాలీవుడ్ లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ అవార్డ్స్ వేడుకలో 2021, 2022, 2023 లో

మిగతా 2లో..

## 12 నుంచి రంజాన్ మాసం ప్రారంభం

హైదరాబాద్,మార్చి6: పవిత్ర రంజాన్ మాసం మార్చి 12వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గంట ముందే ఇంటికి వెళ్లేలా వెసులుబాటు



కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 12 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే తమ విధులు ముగించుకుని ఇంటికి వెళ్లొచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నెలవంక దర్శనం మరుసటి రోజు నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇస్లాంలో రంజాన్ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. దివ్య గ్రంథమైన పవిత్ర ఖురాన్ ఈ మాసంలోనే దివి నుంచి భువిపైకి అవతరించింది. దీనికి ప్రతీకగా ఈ మాసంలో ఉపవాసాలను ఆచరిస్తారు. రంజాన్ మాసంలో సూర్యోదయానికి ముందు ముస్లింలు ఉపవాస దీక్షను ప్రారంభించి ప్రార్థనల్లో పాల్గొంటారు. సాయంత్రం సూర్యాస్తమయం అనంతరం ఉపవాస దీక్షను విరమిస్తారు.



## ప్రతి నియోజకవర్గంలో
# ఒక క్లస్టర్

మొదటిపేజీ తరువాయి..

తెలిపారు. అందుకే అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రిజర్వాయర్ల నుంచి నీళ్లు విడుదల చేయాలని కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ ప్రాంతంల్లోని రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారని సీఎం చెప్పారు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో తాగునీటి కష్టాలు రాకుండా చూడాల్సిన అవసరముందన్నారు. అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం అన్నారు.పలువురు రైతులు కాన్ఫరెన్స్ లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. తాము పండిస్తున్న పంటల ద్వారా లాభాలు సాధిస్తున్న తీరును వివరించారు. రైతు నేస్తం కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారం అందిస్తోంది. అధికారులతోపాటు వ్యవసాయ నిపుణులు నేరుగా పంట పొలాల నుంచి రైతులతో ముఖాముఖి మాట్లాడి వాళ్ల సమస్యలను తెలుసుకుంటారు. సాగుపై సలహాలు, సూచనలతోపాటు అధునాతన మెలకువలను అందిస్తారు. ఆదర్శ రైతుల తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేందుకు వీలు కల్పిస్తారు. రైతు నేస్తం ప్రారంభోత్సంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు పాలుపంచుకున్నారు. ప్రతి సీజన్ లో రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించేందుకు సలహాలు, సూచనలిచ్చేందుకు రైతు నేస్తం ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. నేరుగా రైతులు వ్యవసాయ నిపుణులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు, ఏ పంట వేయాలనేది మొదలు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేంత వరకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కాకుండా లాభసాటి ధర రావాలనే ఆలోచనతో ప్రభుత్వం కార్యాచరణ చేస్తోందన్నారు. రైతు భరోసా, రైతు రుణ మాఫీ, రైతులకు విత్తనాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఐకేపీ సెంటర్లు, మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో దాదాపు 26 రకాల పంటలు పండటానికి అనుకూలమైన భూములు, వాతావరణం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వరి, పత్తి , మిర్చీ పంటలకే పరిమితం కావద్దని రైతులకు సూచించారు. ఇతర పంటలు సాగు చేయాలని కోరారు. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. తక్కువ నీళ్లతో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి, ఎక్కువ లాభాలు వచ్చేలా పంటల ప్రణాళిక చేసుకోవాలని చెప్పారు.వ్యవసాయ శాఖ చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం 110 సెంటర్లలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన రైతు నేస్తంను భవిష్యత్తులో అన్ని గ్రామాలకు విస్తరిస్తామని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సూచనలతో ప్రభుత్వం ఇటీవల పంటల భీమా పథకాన్ని అమల్లోకి తెచ్చిందని గుర్తు చేశారు. రైతులు చనిపోతే ఆ కుటుంబాన్ని రైతు బీమా పథకం ఆదుకుంటుందన్నారు. రైతులు ధీమాగా బతికేందుకు వీలుగా పంటల బీమా పని చేస్తుందని చెప్పారు. పంట పెట్టుబడి పెట్టినప్పటి నుంచి కరువు వచ్చినా, వరద వచ్చినా నష్టపరిహారం అందుతుందన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి వారికి తిరిగి వస్తుందని అన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఉండదన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులు ధైర్యం కోల్పోవద్దన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.



# ఆర్ఆర్ఆర్ చిత్రానికి మూవీ ఆఫ్ ది డికేడ్ అవార్డు

మొదటిపేజీ తరువాయి..

విడుదలైన చిత్రాలనుంచి - బెస్ట్ యాక్టర్(మేల్, ఫిమేల్), బెస్ట్ మూవీ డైరెక్టర్, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్, బెస్ట్ సింగర్ (మేల్, ఫిమేల్), బెస్ట్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, బెస్ట్ లిరిక్స్, బెస్ట్ సెలబ్రిటీ సింగర్, వంటి 42 కేటగిరీలకు అవార్డ్స్ అందజేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి అతిరథ మహారథులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి హీరోలు మంచు మనోజ్, ఉత్తమ నటులుగా ఎంపికైన.. నిఖిల్ సిద్ధార్థ, సందీప్ కిషన్, తేజ సజ్జ, ఆనంద్ దేవరకొండ, హీరోయిన్లు డింపుల్ హాయతి, దక్ష నగార్కర్, ఆషిక రంగనాథ్, నేహా శెట్టి, ఫరియ అబ్దుల్లా గామా అవార్డులు అందుకోవడమే కాకుండా అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో



ఆకట్టుకున్నారు.అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ అందుకున్న ఆర్ఆర్ఆర్ చిత్రానికి గానూ.. గామా మూవీ ఆఫ్ ది డికేడ్ అవార్డును చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య అందుకున్నారు.

జాతీయ పురస్కారం అందుకున్న పుష్ప ఉత్తమ చిత్రం గా, ఉత్తమ నటుడుగా అల్లు అర్జున్, ఉత్తమ చిత్రాలుగా పుష్ప, బ్రో, సీతారామం, గామా బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్లు గా దేవి శ్రీ ప్రసాద్, తమన్, హేషం అబ్దుల్ వహాబ్, ఉత్తమ ఆల్బమ్ గా సీతారామం- విశాల్ చంద్ర శేఖర్, బెస్ట్ సింగర్స్ గా అనురాగ్ కులకర్ణి, ధనుంజయ్, హారిక నారాయణ్, ఎంఎల్ శృతి, మౌనిక యాదవ్, ట్రెండింగ్ సాంగ్ కు.. రఘు కుంచె, గామా గద్దర్ మెమోరియల్ అవార్డు నల్గొండ గద్దర్ నరసన్న, లెజెండరీ మ్యూజిక్ అవార్డ్ సంగీత దర్శకులు కోటి గారు, 25 సంవత్సరాల సంగీత దర్శకులుగా ఎం ఎం శ్రీలేఖ గామా పురస్కారం అందుకున్నారు. ఇక ఈ అవార్డ్స్ లో కూడా పుష్ప అదరగొట్టింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు అవార్డులను కైవసం చేసుకుంది.ఇక గామా అవార్డ్స్ సీఈవో సౌరభ్ మాట్లాడుతూ.."వేలాదిమంది తెలుగు, తమిళ, మళయాల సినీ ప్రేమికుల మధ్యలో దుబాయ్ గామా వేదికపై ఇలా ప్రెస్టేజియస్ గా ఈ వేడుక నిర్వహించడం ఆనందంగా ఉంది. గామా స్థాపించినప్పటి నుండి.. గామా అవార్డు వేదికకు సహాయ, సహకారాలు అందిస్తూ.. అవార్డు ఫంక్షన్‌ను ప్రసారం చేస్తున్న ఈటీవీ యాజమాన్యానికి ధన్యవాదాలు" అని తెలియచేశారు. గామా జ్యూరీ సభ్యులు మ్యూజిక్ డైరెక్టర్ కోటి గారు, సీనియర్ దర్శకులు వీ ఎన్ ఆదిత్య , మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం శ్రీలేఖ ఆధ్వర్యంలో సుమ, హైపర్ ఆది యాంకరింగ్ చేసిన ఈ కార్యక్రమంలో టాలీవుడ్ సింగర్స్ తో పాటలు, హీరోయిన్ల డాన్స్ పెర్ఫార్మెన్స్, ముక్కు అవినాష్, రోహిణి కామెడీతో అలరించారు అని దర్శకులు ప్రసన్న పాలంకి తెలిపారు.

ప్రాపర్టీస్ ప్రెజెంట్స్ గామా అవార్డు గ్రహీతలు:

గామా బెస్ట్ యాక్టర్ 2021 - అల్లు అర్జున్ (పుష్ప)

గామా బెస్ట్ యాక్టర్ 2022 - నిఖిల్ సిద్ధార్థ (కార్తికేయ 2)

గామా బెస్ట్ యాక్టర్ 2023 - ఆనంద్ దేవరకొండ (బేబీ)

గామా బెస్ట్ హీరోయిన్ 2021 - ఫరియా అబ్దుల్లా (జాతి రత్నాలు)

గామా బెస్ట్ హీరోయిన్ 2022 - మృణల్ ఠాకూర్ (సీతారామం)

గామా బెస్ట్ హీరోయిన్ 2023 - సంయుక్త మీనన్ (విరూపాక్ష)

గామా బెస్ట్ ప్రామిసింగ్ యాక్ట్రెస్ 2021 - హర్షిక రంగనాథ్ (అమిగోస్, నా సామి రంగ)

గామా బెస్ట్ ప్రామిసింగ్ యాక్ట్రెస్ 2022 - దక్ష నగర్ (జాంబిరెడ్డి)

గామా బెస్ట్ ప్రామిసింగ్ యాక్ట్రెస్ 2023 - డింపుల్ హయతి (ఖిలాడి)

గామా బెస్ట్ ట్రెండింగ్ యాక్టర్ - తేజ సజ్జా (హనుమాన్)

గామా మూవీ ఆఫ్ ద ఇయర్ 2021 - పుష్ప (మైత్రి మూవీ మేకర్స్.. యలమంచిలి రవి నవీన్ యెర్నేని)

గామా మూవీ ఆఫ్ ద ఇయర్ 2022 - సీతారామం (వైజయంతి మూవీస్.. స్వప్న, ప్రియాంక దత్)

గామా మూవీ ఆఫ్ ది ఇయర్ 2023 - బ్రో (పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ టిజి విశ్వప్రసాద్)

గామా బెస్ట్ డైరెక్టర్ 2021 - సుకుమార్ (పుష్ప)

గామా బెస్ట్ డైరెక్టర్ 2022 - హను రాఘవపూడి (సీతారామం)

గామా బెస్ట్ డైరెక్టర్ 2023 - బాబీ కొల్లి (వాల్తేరు వీరయ్య)

గామా జ్యూరీ బెస్ట్ యాక్టర్ 2022 - విశ్వక్ సేన్ (అశోక వనంలో అర్జున కళ్యాణం)

గామా జ్యూరీ బెస్ట్ యాక్టర్ 2023 - సందీప్ కిషన్ (మైకేల్)

గామా లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ - డాక్టర్ కోటి సాలూరి (40 ఇయర్స్ ఆఫ్ మ్యూజికల్ జర్నీ)

గామా స్పెషల్ జ్యూరీ అవార్డు - ఎం ఎం శ్రీలేఖ (25 ఇయర్స్ ఆఫ్ మ్యూజికల్ జర్నీ)

గామా గౌరవ్ సత్కర్ - చంద్రబోస్ (ఆస్కార్ విన్నింగ్ ఇండియన్ లిరిసిస్ట్)

గామా బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ 2021 - దేవిశ్రీప్రసాద్ (పుష్ప)

గామా బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ 2022 - ఎస్ ఎస్ తమన్ (భీమ్లా నాయక్)

గామా బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ 20 23 - హేశం అబ్దుల్ వహాబ్ (ఖుషి)

గామా బెస్ట్ ఆల్బమ్ 20 22 - సీతారామం (విశాల్ చంద్రశేఖర్)

గామా బెస్ట్ లిరిసిస్ట్ 2023 - కాసర్ల శ్యామ్ (చంకీలా అంగీ లేసి దసరా)

గామా బెస్ట్ వర్సటైల్ యాక్టర్ - మురళీ శర్మ

గామా జ్యూరీ మెంబర్ - వీ ఎన్ ఆదిత్య (గామా జ్యూరీ)

గామా మోస్ట్ పాపులర్ సాంగ్ 2021 - నీలి నీలి ఆకాశం (అనూప్ రూబెన్స్)

గామా మోస్ట్ పాపులర్ సాంగ్ 2023 - పూనకాలు లోడింగ్ (దేవి శ్రీ ప్రసాద్)

గామా మూవీ ఆఫ్ ది డెకేడ్ - ఆర్ ఆర్ ఆర్

గామా మోస్ట్ ట్రెండింగ్ సాంగ్ - నెక్లెస్ గొలుసు (రఘు కుంచె)

గామా బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ మేల్ 2021 - ధనుంజయ్ (నా మది నీదదై)

గామా బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ ఫిమేల్ 2021 - ఎం ఎల్ శృతి (అడిగా అడిగా)

గామా బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ ఫిమేల్ 2022 - హారిక నారాయణ (లాహే లాహే ఆచార్య)

గామా బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ ఫిమేల్ 2023 - చిన్మయి (ఆరాధ్య - ఖుషి)

గామా బెస్ట్ పాపులర్ సాంగ్ 2021 - మౌనిక యాదవ్ (సామి నా సామి - పుష్ప)

గామా గద్దర్ మెమోరియల్ అవార్డు : ఫోక్ సింగర్ నల్లగొండ గద్దర్ నరసన్న

గామా బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ మేల్ 2022 - అనురాగ్ కులకర్ణి (సిరివెన్నెల- శ్యాం సింగరాయ్)

గామా బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ మేల్ 2023 - రాహుల్ సిప్లిగంజ్ (ధూమ్ దాం - దసరా)

## జూన్ 4, 5 తేదీల్లో
# ఐసెట్ పరీక్ష

మొదటిపేజీ తరువాయి..

బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో మూడు లేదా 4 ఏళ్ల డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఇక ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు పొందేవారు బీసీఏ/ ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ/బీఎస్సీ /బీకాం /బీఏలో మూడు సంవత్సరాల డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఇంటర్‌లో మ్యాథ్స్ సబ్జెక్ట్ తప్పనిసరిగా చదివి ఉండాలి. మొత్తం 150 నిమిషాల వ్యవధిలో 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమాధానలు రాయవల్సి ఉంటుంది. అమ్యాథమేటికల్ ఎబిలిటీ, నలిటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. నెగిటివ్ మార్కులు ఉండవు.

## 12న తెలంగాణకు
# హోంమంత్రి అమిత్ షా

మొదటిపేజీ తరువాయి..

పేదలకు ఇళ్లు కట్టించిన మోదీకి సొంత ఇల్లు లేదన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత మన ప్రధాని మోదీదేదని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్.. కొడుకునో కూతురునో ముఖ్యమంత్రి చేయడానికి పని చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను వంచించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. 6 గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని ఇవ్వటం లేదని చెప్పారు. అందరికీ రూ. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆంక్షలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. 200యూనిట్ల విద్యుత్ బిల్లు ఉచితంపై మాట తప్పారని చెప్పారు. రైతు భరోసా కింద రూ. 15వేలు.. కూలీలకు రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ హామీలు ఉంటాయని నమ్మకం లేదన్నారు. డిసెంబర్‌లోనే రైతు భరోసా ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసే పార్లమెంట్ ఎన్నికల్లో పని చేస్తున్నాయని అన్నారు. గడీలు బద్దలు కొట్టాలని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అదే గడీల్లో కాంగ్రెస్ నేతలు తల దాచుకుంటూన్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు.

## ప్రజల్ని దోచుకునేందుకేనా ఎల్ఆర్ఎస్...?

**సిర్గాపూర్ మార్చ్ 06(ప్రజాజ్యోతి):**
సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ లో బుధవారం రోజు చోౌరస్తాలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్ పాటిల్, బిఆర్ఎస్ నాయకులు బైటయించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల మంది దరఖాస్తుదారులపై కనీసం లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.20వేల కోట్ల వరకు భారాన్ని మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. బుధవారం దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేవరకొండ పట్టణంలోని బస్ స్టాండ్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పాల్గొని మాట్లాడుతూ....ఎల్ఆర్ఎస్ పేరిట 25 లక్షల మంది దరఖాస్తుదారుల నుంచి రూ.20 వేల కోట్ల వరకు వారి రక్త మాంసాలను పీల్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు..ఎల్ఆర్ఎస్‌ను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉచితంగా అమలు చేస్తామంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్... అధికారంలోకి రాగానే ప్రజలను పీడిస్తున్నారని మండిపడ్డారు.అప్పుడు ఎల్ఆర్ఎస్ వద్దు అంటూ మాట్లాడిన రేవంత్, భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎందుకు మౌనం వహించారో ప్రజలకు చెప్పాలి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలుగా మ్యానిఫెస్టోలో 420 హామీలు,



6 గ్యారెంటీలను ఇచ్చారని, కానీ బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలనే కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల రెగ్యులరైజేషన్ చేయాలని అయన డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని అన్నారు. గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం మార్గదర్శకాలు రూపొందించినప్పుడు, ఇదే కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడినరు అని ఆయన అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్ కార్యక్రమంలో ఎలాంటి చార్జీలు వసూలు చేయబోమని ప్రకటించాలని, లేకుంటే భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్,కంకణాల వెంకట్ రెడ్డి,ఎంపీపీ వంగల ప్రతాప్ రెడ్డి,బిఆర్ఎస్ మండలాల అధ్యక్షులు వెలుగురి వల్లపు రెడ్డి,రాజినేని వెంకటేశ్వర రావు,రమావత్ దస్రు నాయక్,వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్,గాజుల ఆంజనేయులు,బోయపల్లి శ్రీనివాస్ గౌడ్,ముక్కమల్ల బాలయ్య,ఉజ్జిని విద్యాసాగర్ రావు,కేసాని లింగా రెడ్డి,మేకల శ్రీనివాస్ యాదవ్,రమావత్ మోహన్ కృష్ణ,ఉజ్జిని నరేందర్ రావు,మాధవరం జనార్ధన్ రావు,రమావత్ రమేష్,మునగాల అంజి రెడ్డి,మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి,కేతావత్ శంకర్ నాయక్,భగవంతు రావు,వేముల రాజు,బొడ్డుపల్లి కృష్ణ,రమావత్ తూలిసిరాం,రాఘవ చారి,ఎర్ర యాదగిరి,నాగవరం ప్రభాకర్ రావు,రమావత్ నర్సింహా,సిరాసనవడా శ్రీను,గొర్ల శ్రీనివాస్ యాదవ్,బొడ్డుపల్లి జయంత్,కుంభం నరేష్ గౌడ్,జయప్రకాష్ నారాయణ,రేపని ఇద్దయ్య,ఇలియస్,జెల రేణు గౌడ్,జనీబాబా, బాబా,నత్తార్,విజయ్ం,లక్ష్మణ్,గోవర్ధన్,హారిదాన్,హారికృష్ణ, వెంకట్,మల్లేష్,అంజి,నాగు,తదితరులు ఉన్నారు.

## నారాయణ్ ఖేడ్ లో భారీ అగ్ని ప్రమాదం

### వాహనంలోని గ్యాస్ సిలెండర్ లీకై పేలుడు

**నారాయణ్ ఖేడ్ మార్చ్ 06(ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని కరస్ గుత్తి రోడ్డులో కాకతీయ పాఠశాల సమీపంలో గల కార్ మెకానిక్ షెడ్డులో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలుడు సంబవించి భారీగా మంటలు, పొగలు వ్యాపించాయి. సుమారు మధ్యాహ్నం 12 గంటల సమయంలో షెడ్డులో గల కారులో ఉన్న గ్యాస్ సిలిండర్ పెద్ద శబ్దంతో పేలడంతో అక్కడ ఉన్న జనాలు భయ బ్రాంతులకు గురై పరుగులు తీశారు. సిలిండర్ పేలి 400 మీటర్ల దూరంలో పడింది. వెంటనే స్థానికులు అప్రమత్తమై అగ్ని మాపక సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే స్పందించి సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు కాని భారీగా ఆస్తి నష్టం జరిగింది. దాదాపు ఏడు వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.



### వేతన సవరణ మండలి (పి.ఆర్.సి) ఫార్మసిస్ట్ లకు సముచిత వేతనాలు - సరియైన ప్రమోషన్ లపై

# దృష్టి సారించాలి

వైద్యసేవలు ప్రధానంగా ఔషదాలపై ఆధారపడి ఉంటాయి. ఔషధకల్పన విజ్ఞానాన్ని ఫార్మసీ అని, ఫార్మసీ నిపుణులను ఫార్మసిస్ట్ లని అంటారు. 18వ శతాబ్ది ఉత్తరార్థంలో వైద్యశాస్త్రం నుంచి ఫార్మసీ ఒక మెడికల్ స్పెషాలిటీగా విభజన జరిగి పలు బ్రాడ్ స్పెషాలిటీలుగా, సూపర్ స్పెషాలిటీలుగా విస్తరించింది. భారతదేశంలో ఫార్మసీ విద్య మరియు వృత్తి ఫార్మసీ ఆక్ట్ 1948 ప్రకారం ఏర్పడిన ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పి.సి.ఐ.) నియంత్రణలో కొనసాగుతున్నది. ఫార్మసీ విద్యకు ఉన్న సాంకేతిక లక్షణాల వల్ల విద్యా ప్రమాణాలను పర్యవేక్షించే బాధ్యతను 1987లో ఏర్పాటైన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎ.ఐ.సి.టి.ఇ.) కూడా పంచుకొంటున్నది. తెలంగాణలో హాస్పిటల్ ఫార్మసిస్ట్ లు ప్రస్తుతం ఫార్మసిస్ట్ గ్రేడ్ –2 (నాన్ గెజిటెడ్), ఫార్మసిస్ట్ గ్రేడ్ –1 (నాన్ గెజిటెడ్) మరియు ఫార్మసీ సూపర్వైజర్ (గెజిటెడ్) అనే హోదాలలో పని చేస్తున్నారు. ఫార్మసిస్ట్ లు ప్రాణ రక్షకాలైన ఔషధాలు, సర్జికల్స్, ఇతర సామాగ్రికి ఎస్టిమేట్స్ తయారి, సేకరణ, నాణ్యత, స్టోరేజ్, పంపిణీలకు బాధ్యత వహిస్తారు. ఔషధ సంబంధిత సమస్త సమాచారానికి విషయనిపుణులుగా వ్యవహరిస్తారు. ఔషధ వినియోగంపై పేషంట్ లకు, నర్స్ లకు, ఫిజిషియన్ లకు సలహాలు, సూచనలు అందిస్తారు. అన్ని ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలలో పాల్గొంటారు. అత్యవసర సమయాలలో రాత్రింబవల్లు సేవలు అందిస్తారు. నివేదికలు, స్టాటిస్టికల్ మరియు క్లరికల్ పనులు చేస్తారు. ఫార్మసీ విద్యార్థులకు అభ్యాస శిక్షణ ఇస్తారు. వైద్యాధికారుల అనుపస్థితిలో చికిత్సా బాధ్యతలు తీసుకొంటారు. బ్రిటిష్ కాలం నుండి ఈ సంప్రదాయం కొనసాగుతున్నది. శంకర్ రావు చవాన్ పార్లమెంటరీ సబ్ కమిటీ ఈ సంప్రదాయాన్ని మరింత పటిష్టపరచాలని సూచించింది. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1997లో ఈ మేరకు అధికారికంగా అనుమతిని ఇచ్చింది. ఔషధ చికిత్సలో ఫార్మాస్యూటికల్ కేర్ భావన అంతర్జాతీయంగా బలపడింది. కనుక అన్ని హాస్పిటల్ లలో గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫార్మసిస్ట్ ల నేతృత్వంలో హాస్పిటల్ %ు% క్లినికల్ ఫార్మసీ డిపార్ట్మెంట్ లను నెలకొల్పవలసి ఉన్నది. జాతీయ మానవహక్కుల కమిషన్ 1999లోనే ఈ విషయమై ప్రభుత్వాలకు నిర్దేశాలు కూడా జారీ చేసింది.

ప్రస్తుతం హాస్పిటల్ ఫార్మసిస్ట్ ల కనీస అర్హత డిప్లొమా ఇన్ ఫార్మసీ (డి.ఫార్మ్.). పి.సి.ఐ. ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్ 2020 అమలులోనికి వచ్చిన యెడల ఫార్మసిస్ట్ కావటానికి బి.ఫార్మ్. కనీస అర్హత కాగలదు. 80% ఫార్మసీ కాలేజ్ లు బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బి. ఫార్మ్.) ని బోధిస్తున్నాయి. అమెరికా నమూనాలో హాస్పిటల్ %ు% క్లినికల్ ఫార్మసీ నిపుణుల కోసం 2008లో పరిచయం చేసిన 6 సంవత్సరాల డాక్టర్ ఆఫ్ ఫార్మసీ (ఫార్మ్.డి.) కోర్స్ లో ఇప్పటికే 10 బ్యాచ్ ల విద్యార్థులు ఉత్తీర్ణులై ఉన్నారు. అయినా ప్రభుత్వపరంగా ఏ ఒక్క వైద్యశాలలోనూ హాస్పిటల్ %ు% క్లినికల్ ఫార్మసీ డిపార్ట్మెంట్ లు ఏర్పాటు చేయలేదు. కనుక తప్పని పరిస్థితిలో బి.ఫార్మ్. మరియు ఫార్మ్.డి. పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 గా చేరుతున్నారు.

డిప్లొమా ఫార్మసిస్ట్ లకు డిప్లొమా ఇంజినీర్ లతో సమానమైన వేతనం ఇవ్వాలని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1997లో సిఫారిష్ చేసింది. అయితే ఇంజినీరింగ్ డిప్లొమాకు 10వ తరగతి పూర్వ అర్హత కాగా, ఫార్మసీకి పూర్వ విద్యార్హత ఇంటర్మీడియెట్ సైన్స్ లేదా బి.ఎస్ సి. మొదటి సంవత్సరం ఉత్తీర్ణత అయినందున డిప్లొమా ఇంజినీర్ ల కంటె హెచ్చు జీత భత్యాలు ఉండాలని ఎ.ఐ.సి.టి.ఇ. 1998లో సూచించింది. ఫార్మసీ అధ్యాపకులు ఎ.ఐ.సి.టి.ఇ. స్కేల్స్ సాధించుకోగా, రోగులకు నిత్యం సేవలు అందించే హాస్పిటల్ ఫార్మసిస్ట్ లు దుర్భర జీవితం గడుపుతున్నారు. ఫిజిషియన్ ల నుండి స్పెషలైజ్ అయిన, ఎంతో కీలకమైన ఫార్మసిస్ట్ లకు నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది కంటె తక్కువ వేతనాలు ఉండటం గర్హనీయం! ఫార్మసిస్ట్ లు వైద్యశాలలలో బహుముఖమైన సేవలు అందిస్తున్నప్పటికీ తగిన వేతనాలు లేక, సరియైన ప్రమోషన్ వ్యవస్థ లేక ఎంతో వివక్షకు గురి అవుతూ మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఆరోగ్య శాఖలో కీలక భూమిక నిర్వహిస్తున్న ఫార్మసిస్ట్ లు 1978 పి.ఆర్.సి. నుండి వేతన విషయంలో తీవ్రమైన అన్యాయానికి గురి అవుతున్నారు. ఈ అన్యాయం తదనంతర పే రివిజన్ రిపోర్ట్ లలోను మరింత పెరుగుతూనే వస్తున్నది. ఫార్మసిస్ట్ ల ప్రాధాన్యతను, వారికి జరుగుతున్న వేతన విషయక అన్యాయాన్ని పే రివిజన్ కమిటీ దృష్టికి తీసికొని వస్తూ, సముచితమైన సిఫారిష్ లు చేయవలసినదిగా కోరుచున్నాము.

### 1. సాధారణ మార్పులు : –

ఫార్మసిస్ట్ ల ఉద్యోగ ప్రస్థానపు ర్యాంకింగ్ దిగువ విధంగా ఉండాలి. %ూ%. సబ్–అసిస్టెంట్ సివిల్ ఫార్మసిస్ట్ (డి.ఫార్మ్.తో ప్రవేశం – నాన్ గెజిటెడ్), %ద%. అసిస్టెంట్ సివిల్ ఫార్మసిస్ట్ (డి.ఫార్మ్.తో 1వ పదోన్నతి లేదా బి.ఫార్మ్./ ఫార్మ్.డి.తో ప్రవేశం – గెజిటెడ్) %జ%. డిప్యూటి సివిల్ ఫార్మసిస్ట్ (డి.ఫార్మ్.తో 2వ పదోన్నతి లేదా బి.ఫార్మ్./ ఫార్మ్.డి.తో 1వ పదోన్నతి) ఆ పైన %ఱ%. సివిల్ ఫార్మసిస్ట్.

దీనివల్ల ప్రమోషన్స్, ఇంటర్ డైరెక్టరేట్ మరియు ఇంటర్ డిపార్ట్మెంటల్ ట్రాన్స్ఫర్స్ హేతుబద్ధంగా చేయవచ్చు.

ప్రస్తుత ఫార్మసిస్ట్ హోదాలను దిగువ విధంగా రీడిసిగ్నేట్ చేయాలి. %ూ%. ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 ను ఫార్మసీ ఆఫీసర్ గ్రేడ్ 2/ ఫార్మసీ ఆఫీసర్ గా, %ద%. ఫార్మసీ ఆఫీసర్ గ్రేడ్ 1/ సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ గా మరియు %జ%. ఫార్మసీ సూపర్వైజర్ ను డి.ఎం.ఎచ్.ఒ.లలో డిస్ట్రిక్ట్ ఫార్మసీ ఆఫీసర్ గా, హాస్పిటల్ లలో సూపరింటెండెంట్ ఫార్మసీ ఆఫీసర్/ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ గా మార్చాలి. ఫార్మసీ చట్టం మరియు డ్రగ్స్ %ు% కాస్మెటిక్స్ ఆక్ట్ ప్రకారం అన్ని బస్తీ దవాఖానలు/ పల్లె దవాఖానలు/ హెల్త్ %ు% వెల్నెస్ సెంటర్ లు/



ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ లు/ పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్/ హెల్త్ కమిషనరేట్ లోని అన్ని మెడికల్ స్టోర్ లు, వాక్సిన్ హౌస్ లు, వైద్య కళాశాలల కమ్యూనిటీ మెడిసిన్ శాఖలకు అనుబంధంగా ఉన్న రూరల్ హెల్త్ సెంటర్ లు, వెటరినరీ మెడికల్ స్టోర్స్, అంగన్వాడీ మెడికల్ స్టోర్స్ లో ఫార్మసిస్ట్ లను నియమించాలి. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం గతంలో సిఫారిష్ చేసిన ఫార్మసిస్ట్ పోస్ట్ లను, జాతీయ ఆరోగ్య విధానంలో ప్రకటించిన విధంగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ పోస్ట్ లను డి.ఫార్మ్./ బి.ఫార్మ్./ ఫార్మ్.డి. అభ్యర్థులతో భర్తీ చేయాలి. ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాలలో ఫార్మసీ డైరెక్టరేట్స్ ఏర్పరచి, ఆయా స్థాయి పదవులు కల్పించాలి. అన్ని బోధనా వైద్యశాలలు, జిల్లా వైద్యశాలలలో హాస్పిటల్ %ు% క్లినికల్ ఫార్మసీ డిపార్ట్మెంట్స్ నెలకొల్పాలి.

### 2. వేతన మార్పులు : –

ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 లకు ఎంట్రీ లెవెల్ డిప్లొమా ఇంజినీర్ స్కేల్ ం 2 ఇంక్రిమెంట్స్, ఫార్మసిస్ట్ గ్రేడ్ 1 లకు ఎంట్రీ లెవెల్ గ్రాడ్యుయేట్ ఇంజినీర్ స్కేల్, ఫార్మసీ సూపర్వైజర్ లకు డెప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ స్కేల్ మంజూరు చేయాలి. డిప్లొమా ఇంజినీర్ లు తొలి పదోన్నతిలోనే గెజిటెడ్ ఆఫీసర్ హోదా పొందుతున్నారు. ఇదే సహజ న్యాయాన్ని డిప్లొమా ఫార్మసిస్ట్ లకు వర్తింప చేసి ఫార్మసిస్ట్ గ్రేడ్ 1 ను గెజిటెడ్ పోస్ట్ గా ప్రకటించాలి.

### 3. అలవెన్స్ లు : –

పేషెంట్ కేర్ అలవెన్స్: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న విధంగా ఫార్మసిస్ట్ లకు ప్రతి నెల మూల వేతనంలో 10% పేషెంట్ కేర్ అలవెన్స్ ఇవ్వాలి.

రిస్క్ అలవెన్స్: అంటు వ్యాధులతో బాధ పడుతున్న రోగులతో మెలగవలసి ఉంటుంది. కావున నెలకు రూ.1,000/– రిస్క్ అలవెన్స్ ఇవ్వాలి.

రేషన్ అలవెన్స్: వేళాపాళా లేని డ్యూటీలు ఉంటాయి. నెలకు రూ.500/– రేషన్ అలవెన్స్ ఇవ్వాలి.

యూనిఫాం అలవెన్స్: సంవత్సరానికి రూ.1,500/– కు పెంచాలి.

వాషింగ్ అలవెన్స్: ఏప్రాన్ ధరించే ఇతర ఉద్యోగులకు ఇస్తున్న విధంగా వాషింగ్ అలవెన్స్ ఇవ్వాలి.

అడిషనల్ ఎచ్.ఆర్. ఎ.: హాస్పిటల్ కు సమీపంలో ఉండాలి. కనుక మూల వేతనంలో 10% అదనపు హౌజ్ రెంట్ అలవెన్స్ ఇవ్వాలి.

కన్వేయన్స్ అలవెన్స్: విధులకు సత్వరంగా చేరుకోవటానికి నెలకు రూ. 1,000/– కన్వేయన్స్ అలవెన్స్ ఇవ్వాలి.

నాన్ ప్రాక్టీసింగ్ అలవెన్స్: మూల వేతనంలో 25% నాన్ ప్రాక్టీసింగ్ అలవెన్స్ ఇవ్వాలి. లేదా ప్రైవేట్ ఫార్మసీ ప్రాక్టీస్ కు అనుమతించాలి.

రూరల్ అలవెన్స్: గ్రామీణ ప్రాంతాలలో రూరల్ అలవెన్స్ ఇవ్వాలి.

ఏజెన్సీ అలవెన్స్: మెడికల్ ఆఫీసర్ లకు ఇస్తున్న విధంగా ఏజెన్సీ అలవెన్స్/ బ్యాడ్ క్లైమేట్ అలవెన్స్ ఇవ్వాలి.

ఎన్.జి.జి. ఒ. క్లినిక్ అలవెన్స్: డిస్పెన్సరీ లలో చేసే ఫార్మసిస్ట్ లకు నెలకు రూ.1,000/– ఎన్.జి.జి.ఒ. అలవెన్స్ ఇవ్వాలి.

ఉన్నత విద్యార్హత అలవెన్స్: ఫార్మసీ, సైన్స్, మానేజ్మెంట్, హెల్త్ కేర్ లో ఉన్నత అదనపు విద్యార్హతలు ఉన్న వారికి అడ్వాన్స్ ఇంక్రిమెంట్ లు ఇవ్వాలి.

ఇన్ ఛార్జ్ అలవెన్స్: క్లర్క్ లు లేని చోట క్లరికల్ అలవెన్స్ ను నెలకు రూ. 75/– బదులు రూ. 500/– ఇవ్వాలి. వైద్యాధికారి అనుపస్థితిలో ఇన్ ఛార్జ్ అలవెన్స్ ఇవ్వాలి.

లిటరేచర్ అలవెన్స్: ఔషధ విజ్ఞాన విస్తృతి వల్ల అధునాతన విషయ పరిజ్ఞానం పొందవలసి ఉంటుంది. అందుకు రిఫరెన్స్ గ్రంథాలు, జర్నల్స్ అవసరం. వైజ్ఞానిక సదస్సులు, శిక్షణ తరగతులు హాజరు కావలసి ఉంటుంది. ఇకముందు పి.సి.ఐ. రిజిస్ట్రేషన్ రెన్యువల్ కోసం నిరంతర ఫార్మసీ విద్య తప్పనిసరి. కనుక సంవత్సరానికి రూ.3,000/– లిటరేచర్ అలవెన్స్ ఇవ్వాలి.

పై అంశాలను పే రివిజన్ కమిటీ వారు సానుభూతితో పరిశీలించి సానుకూలమైన సిఫారిష్ లు చేయగలరని మనవి.

డాక్టర్ రాపోలు సత్యనారాయణ
కో–ఆర్డినేటర్
వర్కింగ్ గ్రూప్ ఆన్ ప్రొఫెషనల్ డిగ్నిటీ ఆఫ్ ఫార్మసిస్ట్స్
7–97, పాలకుర్తి – 506146
తెలంగాణ
ఫోన్: 9440163211

## తాటి, ఈత చెట్లు తొలగింపుతో జీవనోపాధి కోల్పోతున్న గీతా కార్మికులు

**గీత కార్మికులకు కల్లు పారే తాటి చెట్లు ఉపాధి**
**రహదారి విస్తరణలో భాగంగా చెట్ల తొలగింపు**
**తొలగించిన తాటి, ఈత చెట్లకు నష్టపరిహారం ఇవ్వాలి**
**ఆర్డిఓ, తాసిల్దార్ ఎక్సైజ్ ప్రొఫెషనల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లకు వినతి**
**గీతా పారిశ్రామిక సహకార సంఘం (సొసైటీ) అధ్యక్షులు పూదరి వరప్రసాద్ గౌడ్ వెల్లడి**

**హుస్నాబాద్, మార్చి 06 (ప్రజా జ్యోతి):** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కల్లు పారే తాటి, ఈత చెట్లను తొలగించడంతో కల్లుగీత కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారని హుస్నాబాద్ గీతా పారిశ్రామిక సహకార సంఘం (సొసైటీ) అధ్యక్షులు పూదరి వరప్రసాద్ గౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జీవనోపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్న గీతా కార్మికులను ఆదుకోవాలని పట్టణంలోని ఆర్డిఓ తాసిల్దార్ స్థానిక ఎక్సైజ్ ప్రొబిషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్ల తొలగింపుతో నష్టపోతున్న గీత కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రోడ్డు వెడల్పులో భాగంగా తొలగించిన తాటి, ఈత





చెట్ల విషయం సంబంధిత అధికారులు సంబంధిత గీతా కార్మికులకు ముందస్తుగా తెలియపరచలేదని ఆరోపించారు. ఒక్కొక్క చెట్టుకు దాదాపు 1900 రూపాయల చొప్పున చెల్లిస్తామని ఎక్సైంజ్ అధికారులు తెలిపారని కానీ ప్రతిరోజు తాటి చెట్టు కులవృత్తితో దాదాపు వెయ్యి రూపాయలు సంపాదించుకునే ఆదాయం తోపాటు జీవితాంతం ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గీతా కార్మికులు కులవృత్తిపై ఆధారపడడం తప్ప అని ప్రశ్నించారు. ప్రభుత్వం తరఫున చెట్లు కోల్పోయిన గీతా కార్మికులకు జీవన ఆధారం చూపించాలని కోరారు. ఎలాంటి సమాచారం లేకుండా చెట్లను తొలగించడంతో కులవృత్తులపై ఆధారపడ్డ గీతా కార్మికులు వారి కుటుంబాలు రోడ్డుపై పడ్డాయని తక్షణమే ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీతా పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ ఉపాధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్లు పెరుమాండ్ల నర్సాగౌడ్, పచ్చిమట్ల రాజయ్య గౌడ్, పూదరి సత్యనారాయణ గౌడ్, తాళ్లపల్లి మల్లేశం గౌడ్, ఇల్లందుల తిరుపతి గౌడ్, బొడిగె వెంకటేష్ గౌడ్, పచ్చిమట్ల రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### హుస్నాబాద్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్

హుస్నాబాద్, మార్చి 06 (ప్రజా జ్యోతి): హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్గా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్




అనురాధ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు.

# నేటి నుండి శ్రీ శ్రీ శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఉత్సవాలు.

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం -ఎత్తయిన గుట్టపై వెలసిన ఆలయం.
- మూడు రోజులపాటు శివరాత్రి జాతర ఉత్సవాలు
వివిధ మండలాల నుండి భారీగా తరలి రానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ చైర్మన్ ఆది వేణుగోపాల్ .

రాయపోల్/ దౌల్తాబాద్ మార్చి 6 (ప్రజా జ్యోతి): మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని శంభు లింగేశ్వర ఆలయం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అందంగా ముస్తాబు చేశారు. మూడు రోజులపాటు శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయంలోని విగ్రహాలను రంగురంగులతో అలంకరించారు. ఎత్తైన గుట్టపై స్వయంభుగా వెలసిన శంభు లింగేశ్వర స్వామి కోరిన కోరికలు తీర్చే దైవంగా ప్రసిద్ధిగాంచాడు. ప్రతి సంవత్సరం శివరాత్రికి మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ప్రతి ఏటా చేగుంట, గజ్వేల్,సిద్దిపేట, రాయపోల్, తోగుట,మిరుదొడ్డి,రామాయంపేట, హైదరాబాద్ తదితర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తుల సౌకర్యం ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి,యుగ తులసి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శివకుమార్ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. వీరితోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ప్రముఖ కళాకారులు అంజన్న ఆకునూరు దేవన్న, అమూల్యస్తుడు వేణు గజ్వేల్ నక్క శ్రీకాంత్, కమ్మరి తిరుపతి, ఆర్కెస్ట్రా నాగలక్ష్మి, సింగర్ ముకుంద హాజరుకానున్నారు.





7న ఉదయం 10 గంటలకు భక్త బృందంతో భజన కీర్తనలు, 8న అఖండ దీపారాధన గణపతి పూజ, గ్రామదేవతలకు పూజలు, ఆరాధన, ఉమామహేశ్వరి స్వామి కళ్యాణం, ఒడిబియ్యం సేకరించుట, మంగళ వాయిద్యాలతో స్వామివారి ఎదుర్కోలు, ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి శంభు దేవుని గుట్ట వరకు హోమగుంట ప్రతిష్ట, 9న మూడో రోజు అగ్నిగుండాలు బలిహారం, భక్తులు అగ్నిగుండం తొక్కుట,బండ్ల ఊరేగింపు, జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్ తెలిపారు.

అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం ఆలయ కమిటీ చైర్మన్ ఆది వేణుగోపాల్ శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి వసతిని ఏర్పాటు చేశాం భక్తుల తాకిడి ఈసారి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో అందుకు అనుకూలంగా అన్ని ఏర్పాట్లు కల్పించామని ఆది వేణుగోపాల్ అన్నారు

# మహిళా సాధికారత నెరవేర్చడానికే "శక్తి వందన్ అభియాన్

శక్తి వందన్ అభియాన్ ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం
పాల్గొన్న బిజెపి హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్, మార్చి 06 (ప్రజా జ్యోతి):** ప్రధాని నరేంద్ర మోడీ ఊహించిన మహిళా సాధికారత, స్వావలంబన దార్శనికతను నెరవేర్చడానికి శక్తి వందన్ అభియాన్ ప్రోగ్రాం ప్రారంభించారని బిజెపి హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. శక్తి వందన్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వివో, సిఆర్పి, స్వయం సహాయక బృందాల సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి సంక్షేమం కోసం కేంద్రంలోని బిజెపి మోదీ ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువచ్చిందన్నారు. మహిళల అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని అనేక విషయాలలో ప్రభుత్వం విజయం సాధించింది అన్నారు. ప్రధానంగా మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ తీసుకువచ్చిన ఘనత మోడీ ప్రభుత్వం దేనినన్నారు. మహిళల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను, విజయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ప్రచారంలో చురుగ్గా పాల్గొనడానికి శక్తి వందన్ అభియాన్ ప్రోగ్రాంను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రోగ్రాంలో భాగంగా స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలను మహిళా మోర్చా ప్రతినిధులు విస్తృతంగా ప్రజలను కలిసే కసరత్తును చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ వేణుగోపాల్ రావు, లక్కీరెడ్డి తిరుమల స్టేట్ కౌన్సిల్ మెంబెర్, పందిళ్ళ ఎంపీటీసీ బాణాల జయలక్ష్మి, హుస్నాబాద్ టౌన్ అధ్యక్షులు కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, హుస్నాబాద్ మండల అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, అక్కన్నపేట అధ్యక్షులు రామంచ మహేందర్, హుస్నాబాద్ మండల ప్రధానకార్యదర్శి సంపత్



నాయక్ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తోట స్వరూప, శారదా, టౌన్ ప్రధానకార్యదర్శి తోట సమయ్య, టౌన్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, మహేష్కర్, టౌన్ బీజేవైఎం అధ్యక్షులు బీమేశ్వర్, వేల్పుల నాగార్జున, హుస్నాబాద్ టౌన్ ఆర్పి లు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాలుగోన్నారు.

# కెసిఆర్ భారీ బహిరంగసభ విజయవంతం చేయాలి

మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్.. పట్టణ, మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం

**హుస్నాబాద్, మార్చి 06 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ జిల్లా కేంద్రం ఎస్ఆర్ఆర్ గ్రౌండ్ లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్




ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల శంఖారావ సభను విజయవంతం చేయాలని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హుస్నాబాద్ పట్టణం తోపాటు మండలాల ముఖ్య నాయకుల, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల శంఖారావ సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుండి అన్ని మండలాల నుండి అధిక సంఖ్యలో తరలించాలని భారత రాష్ట్ర సమితి ముఖ్య నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకట్, వైస్ చైర్మన్ అయిలేని అనిత, ఎంపీపీ లకావత్ మానస, ఏఎంసీ చైర్మన్ ఎడబోయిన రజని తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండి అన్వర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పురుషులతో సమానంగా మహిళా ఉన్నతికి శ్రమిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

– బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ



వనపర్తి, మార్చి 06(ప్రజా జ్యోతి): పురుషులతో సమానంగా మహిళా ఉన్నతికి ప్రధాని నరేంద్ర మోదీ శ్రమిస్తున్నరని బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అన్నారు. బుధవారం వనపర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన వనపర్తి పట్టణం గాంధీ నగర్లో నారి శక్తివందన్ అభినందన్ కార్యక్రమం మరియు ప్రధానమంత్రి ప్రత్యక్ష ప్రసారం నిర్వహించడం జరిగింది.నారీ శక్తి వందన్ అభినందన్ కార్యక్రమం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా కాలనీ మహిళలతో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు గడిచిన పదేళ్లలో మహిళాభ్యున్నతికై అనేక సంస్కరణలు తీసుకొచ్చారని మహిళా ఆత్మగౌరవకోసమై 11 కోట్ల మరుగుదొడ్లు, కట్టెల పొయ్యి ద్వారా వంట చేసి అనారోగ్యానికి గురవుతున్న మహిళా మూర్తులను పీఎం ఉజ్వల యోజన ద్వారా 10 కోట్ల ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, 2020 నుంచి 2029 వరకు ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్నాడని, కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు 12 వారాలు స్థానంలో 26 వారాలు చేశారని, స్వాతంత్రం వచ్చి 60 ఏళ్ల వరకు బ్యాంకు మెట్లెక్కని మహిళలకు 50 కోట్ల జీరో జన్ ధన్ అకౌంట్లు తెరిపించారని, రూ.4 కోట్ల మహిళలకు పీఎం ఆవాస్ యోజన ద్వారా పక్కా ఇల్లు నిర్మించి గృహప్రవేశం చేయించారని, పురిటిలోనే అమ్మాయిలను చంపేస్తున్నారని తద్వారా బాలికల జనాభా తగ్గుదలను గుర్తించి పీఎం సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆడపిల్లల జనాభాను పెంచారని, జాతీయ హెల్త్ మిషన్ తో ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించి శిశువు మరియు మాతృ మరణాలను పూర్తిగా తగ్గించారని ఇలాంటి అనేక పథకాలు కేవలం మహిళాల కోసమే ప్రవేశపెట్టి మహిళ పక్షపాతిగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోడీ గారికి మహిళలంతా మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు శ్రీమతి జ్యోతి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమతి సుమిత్రమ్మ, బి.కుమారస్వామి,ఏ.సీతారాములు, జిల్లా అధికార ప్రతినిధి %డ% మీడియా ఇన్చార్జి పెద్దిరాజు, పట్టణ అధ్యక్షులు బచ్చు రాము ,మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి వారణాసి కల్పన, యువ మోర్చా నాయకులు కదిరే మధు, యువ మోర్చా అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, యువర్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్, పట్టణ కార్యదర్శి ఎద్దుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ నియోజకవర్గంలో
## జిపిఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

– బషీరాబాద్ మండలం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు

– కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కలాల్ నరసింహులు గౌడ్



బషీరాబాద్ మార్చి 06 ప్రజా జ్యోతి తాండూరు నియోజకవర్గంలోని జిపిఆర్ గార్డెన్లో గురువారం రోజు కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంఏర్పాటు చేయడం జరుగుతుందనిఈకార్యక్రమానికి తాండూర్ శాసనసభ్యులుమనోహర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్, సునీత మహేందర్ రెడ్డి, పాల్గొనడం జరుగుతుంది, రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఉదయం 11 గంటలకు ఈ సన్నాహక సమావేశం ఉంటుంది. కాబట్టి బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బషీరాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కలల నరసింహ గౌడ్ అన్నారు.

## పుట్టపహాడ్ గ్రామంలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



పరిగి, మార్చి 06: (ప్రజా జ్యోతి) వికారాబాద్ జిల్లా కులక్క చర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులై స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులే ఉపాధ్యాయులై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు బి. వెంకటయ్య, కె.శంకర్ అంగన్వాడి టీచర్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వాల్యా నాయక్ తండాలో సిసి రోడ్‌పనులు
## ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాము నాయక్



బషీరాబాద్ మార్చి 06 ప్రజా జ్యోతి బషీరాబాద్ మండలం వాల్యా నాయక్ తండలో ఎన్ఆర్ ఈజీఎస్ 10 లక్షల నిధులతో సిసి రోడ్డు పనులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాము నాయక్, మాజీ సర్పంచ్ శివ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించడం జరిగింది, ఈ సందర్భంలో రాము నాయక్ మాట్లాడుతూ బుయ్యాని మనోహర్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారంగా బషీరాబాద్ మండలానికి మొదటనే మూడు కోట్ల రూపాయలు వివిధ గ్రామాలకు అభివృద్ధి కొరకై నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఆబ్కారి శాఖ సీఐగా జి వెంకటేశం బాధ్యతల స్వీకరణ



కొడంగల్ ఫిబ్రవరి 6 ప్రజా జ్యోతి న్యూస్: కొడంగల్ నియోజకవర్గ ఆబ్కారి శాఖ నూతన సీఐగా జి.వెంకటేశం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆబ్కారి సీఐగా పనిచేసిన సైదులు ను నల్గొండ జిల్లా ఆబ్కారి శాఖ టాస్క్ ఫోర్స్ కు బదిలీ కావడంతో కొడంగల్ ఆబ్కారి శాఖ సీఐగా జి వెంకటేశం ను నియమించడం జరిగింది. బుధవారం బాధ్యతలు స్వీకరించిన సీఐ జి వెంకటేషం కు ఆబ్కారి శాఖ ఎస్సై మరియు కానిస్టేబుల్స్ శుభాకాంక్షలు తెలిపారు.

# సైలెన్సర్లు సైలెంట్

– అధిక శబ్ద కాలుష్యం చేస్తే చర్యలు తప్పవు

– పట్టణ సీఐ సంతోష్ కుమార్

తాండూర్ మార్చ్ 6 ప్రజా జ్యోతి :- ఇక ద్విచక్ర వాహనాలు సైలెంట్ మూడుకు రావాల్సిందే అంటూ తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ ద్విచక్ర వాహనాదారులకును హెచ్చరించారు.బుధవారం రోజు స్థానిక పోలీస్ స్టేషన్ ముందు తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ నేతృత్వంలో పలు రకాల ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లలో మార్పులు చేసి శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.అధిక శబ్దం చేస్తున్న సైలెన్సర్లను ద్విచక్ర వాహనాల నుంచి తొలగించారు. ఎక్కువ శబ్దాలతో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు.అతిగా శబ్దం చేసే సైలెన్సర్లతో వాహన దారులు పట్టుబడితే తొలిసారిగా రూ.వెయ్యి జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.2వేలు జరిమానా, వరుసగా ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని వాహనదారులకు వార్నింగ్ ఇచ్చారు. ఇకనుంచి తాండూరులో చెక్కర్లు కొట్టే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు సైలెంట్ మూడ్లోకి వెళ్లాల్సిందే అంటూ సూచించారు.



## త్రాగునీటి సమస్యలపై స్పెషల్ డ్రైవ్

– ఆదేశించిన జిల్లా కలెక్టర్





పరిగి, మార్చి 06: (ప్రజా జ్యోతి) ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మార్చి 7వ తేదీ నుండి మార్చి15 వరకు త్రాగునీటి సమస్యలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. అందులో భాగంగా బుధవారం పరిగి మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అదేవిధంగా మిషన్ భగీరథ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. ప్రభాకర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి డి. దయానంద్, మిషన్ భగీరథ (గ్రిడ్) ఇంజనీర్ కిరణ్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు రాజకీయ నాయకులు చొరవ చూపాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**వికారాబాద్ ప్రతినిధి, మార్చి06(ప్రజా జ్యోతి):** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఓటరు ముసాయిదా తుది జాబితా పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సమావేశం నిర్వహించి ఓటర్ ముసాయిదాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 1400 మంది ఓటర్ల కంటే ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలు లేవని ఆయన తెలిపారు. ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోదలచిన వారు ఫారం-8 ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. పాత కార్డు స్థానంలో నూతన కార్డు పొందేందుకు అవకాశం ఉందని దరఖాస్తు చేసుకున్నట్లయితే పోస్టల్ ద్వారా కలర్ తో కూడిన ఏపిక్ కార్డును పొందవచ్చని ఆయన తెలిపారు. జిల్లాలో తుది చివరి ప్రచురణలో 9,84,068 మంది ఓటర్లు ఉన్నారని ఇందులో 4,86, 109 మంది పురుషులు, 4,97,920 మంది స్త్రీల ఓటర్లతో పాటు 39 మంది ట్రాన్స్ జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారని ఆయన తెలిపారు. పరిగి నియోజకవర్గంలో 2,66, 273 మంది ఓటర్లకు గాను 1,33,625 మంది పురుషులు, 1,32,639 మంది స్త్రీలు, 9 మంది ట్రాన్స్ జెండర్లు ఓటర్లు ఉన్నారన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,31,679 మంది ఓటర్లు నమోదు కాగా 1,15,019 మంది పురుషులు, 1,16,647 మంది స్త్రీలు, 13 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. తాండూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,43,849 ఉండగా 1,18,228 మంది పురుషులు 1,25,614 మంది స్త్రీలు 7 గురు ట్రాన్స్ జెండర్లు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా కొడంగల్ నియోజకవర్గం లో 2,42,267 మంది ఓటర్లలో 1,19,237 పురుష ఓటర్లు ఓటర్లు కాగా 1,23,020 మంది స్త్రీల ఓటర్లతో పాటుగా 10 మంది ట్రాన్స్ జెండర్ ల ఓట్లు కలిగి ఉన్నట్లు ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నిక ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందని అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు ఎన్నికల విభాగం తహసిల్దార్ నరసింహారెడ్డి తోపాటు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టిఎల్ఎం నిర్వహించిన ఉపాధ్యాయులు

**కొడంగల్ ఫిబ్రవరి 6 ప్రజా జ్యోతి న్యూస్** బుధవారం ప్రాథమిక పాఠశాల పాతకొడంగల్ లో టి ఎల్ ఎం ( %ు ా వీ% )మేళా నిర్వహించడం జరిగింది .ఇందులో భాగం గా విద్యార్థులకు తెలుగు గణితం ఆంగ్లము నకు సంబందించిన అవరోహణ,ఆరోహణ స్తానవిలువలు, అగ్నిపర్వతం నమూనా గుణీ%శీ%తలు తదితర పోటీ నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాఠశాల %ఎ.వీ% క్రాంతి కుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య, మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# మట్కా స్థావరంలపై పక్కానిఘా

### - మట్కా జూదం అంటే భయపడాలి

### - పట్టణ సీఐ సంతోష్ కుమార్

**తాండూర్ మార్చి 6 ప్రజా జ్యోతి :-** మట్కా స్థావరాలపై పోలీస్ ల పక్కా నిఘా ఉంటుందని తాండూర్ పట్టణ సీఐ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీనగర్ ఏరియాలో అదే ప్రాంతానికి చెందిన గోవింద్ ( గోపాల్ రెడ్డి ) వయస్సు 58సంవత్సరాలు మట్కా నిర్వహిస్తున్నట్లు వచ్చిన సంవత్సరం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మట్కా చిట్టిలతోపాటు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ 4 వేల 600 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ వెల్లడించారు.తాండూరు పట్టణ పరిసర ప్రాంతాలలో మట్కా స్థావరాలు ఏమైనా ఉన్నాయా ఇంకెవరైనా మట్కా నిర్వహిస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. తాండూరు పట్టణ పరిసర ప్రాంతాలలో మట్కా స్థావరాలు ఏమైనా ఉన్నాయా ఇంకెవరైనా మట్కా నిర్వహిస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



## గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన మోటార్ సైకిల్

**యాలాల్ మార్చ్ 6 ప్రజా జ్యోతి** గుర్తుతెలియని వాహనం నడిపిన వ్యక్తికి తీవ్ర గాయాలు అయినా సంఘటన యాలాల మండల పరిధిలోని లక్ష్మీనారాయణ చౌరస్తా సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... ఉత్తరప్రదేశ్ కు చెందిన వ్యక్తి వివిధ గ్రామాలు తిరుగుతూ బట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే క్రమంలో లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలోని బాలాజీ రైస్ మిల్ ముందుకు రాగానే తాను నడుపుతున్న వాహనం అదుపుతప్పి కింద పడడంతో అతని కుడి మోకాలు పూర్తిగా విరిగిపోయింది. అతడు చేసిన ఆర్తనాదాలు పలువురికి కంటతడి పెట్టించాయి. వెంటనే అక్కడ ఉన్నవారు 108 కి ఫోన్ చేసి తాండూరు జిల్లా ఆసుపత్రికి క్షతగాత్రుని తరలించారు. క్షతగాతుని పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## అన్ని దానాల కంటే అన్నదానం చాలా గొప్పది

### - సంగీత- నాగరాజ్ ల 21వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు అన్నదానం చేయడం చాలా గొప్ప విషయం

### - డా సుక్కా డానియల్ (స్పెషల్ కరస్పాండెంట్)







**కొత్తూరు మార్చి 06 (ప్రజా జ్యోతి)** నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాలనాగరాజ్ 21వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాదులోని కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి జాతీయ ఉపాధ్యక్షులు డా. సుక్కా డానియల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ..నాగరాజ్ దంపతుల వివాహ దినోత్సవ సందర్భంగా పేదలకు అన్నదానం చేయటం చాలా గొప్ప విషయం అని అన్ని దానాల కంటే అన్నదానం చాలా గొప్పదని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సగ్గు వేణుమాధవ్ మాట్లాడుతూ... సోదరుడు నాగరాజ్ మంచి సేవా తత్పరుడు, దానగుణం గలవాడు మన సంస్థలో ఉపాధ్యక్షుడిగా ఉండడం మన సంస్థకే గర్వకారణం అని నాగరాజును ప్రశంసించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు స్పార్క్స్ మ్యాన్ డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మాట్లాడుతూ.. అన్నదానం మహాదానం అని నాగరాజ్ సంగీత దంపతుల పెళ్లిరోజు నాడు సుమారు 200 మందికి బీదలకు కడుపునిండా అన్నం పెట్టటం మానవత్వానికి మచ్చుతునక లాంటిదని, నాగరాజు ను ఆదర్శ%శీ%గా తీసుకొని మనందరం కూడా పెళ్లి రోజు, పుట్టినరోజులను పురస్కరించుకొని ఇలాంటి కార్యక్రమాలు చేస్తే బాగుంటుందని,మనందరికీ ఈరోజు నాగరాజు,సంగీత దంపతుల పెళ్లిరోజు ఒక గొప్ప ఆదర్శమని వారి సంసార జీవితం నిండు నూరేళ్లు పి, పాపలతో చల్లగా వర్ధిల్లాలని, మ- ునుముందు మరెన్నో సేవా కార్యక్రమాలకు కావలసిన ఆయురారోగ్యాలను వారికి భగవంతుడు కలిగించాలని సంగీత నాగరాజు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి శీలం సరస్వతి, రాష్ట్ర క్రియాశీలక సభ్యురాలు ఉమా, కార్యదర్శి సయ్యద్ పర్వాన, శ్రావణ్, అక్షయ్, శర్మ, కళ్యాణి తదితరులు పాల్గొని అన్నదానం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ శివపార్వతుల కళ్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

### - రామేశ్వరంలో శివలింగానికి ప్రత్యేక పూజలు



**నందిగామ, మార్చి 06(ప్రజాజ్యోతి):** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామేశ్వరం లో శ్రీ శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవం షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి తదితరులను ఆశీర్వదించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, చక్రం రెడ్డి, మోహన్ రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూటికి కొందుర్గు
# సింగిల్ విండో చైర్మన్ "చిట్టెం దామోదర్ రెడ్డి"

- కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న చేరికలు
- బీఆర్ఎస్‌లో ఇన్ని రోజులు పట్టించుకున్న నాధుడే లేడు
- ప్రేమ ఆప్యాయతలకు నిలువెత్తు రూపం ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"
- కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుంధర్ రెడ్డి





**కొత్తూరు మార్చి 06 (ప్రజా జ్యోతి)** ప్రేమ ఆప్యాయతలకు పలకరింపులకు నిలువెత్తు నిదర్శనం షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని కొందూరు మండల సింగిల్ విండో చైర్మన్ చిట్టెం దామోదర్ రెడ్డి అభినందించారు. ఇటీవల టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన చిట్టెం దామోదర్ రెడ్డి బుధవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి తదితరుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో చిట్టెం దామోదర్ రెడ్డితో పాటు కొందుర్గు, చౌదరి గూడెం మండలాలకు చెందిన వివిధ బిఆర్ఎస్ గ్రామాల మాజీ సర్పంచులు 200 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారు.. వారికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో టిఆర్ఎస్ పార్టీ నుండి ఎంతోమంది కాంగ్రెస్లోకి వచ్చారని చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. టిఆర్ఎస్ పార్టీలో ఇన్నాళ్లు తమను పట్టించుకునే నాధుడే లేడని అంతా కుటుంబ పాలన వ్యవహారంగా సాగిందని దామోదర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఒక తహసిల్దార్ వద్దకు వెళ్లినా, ఒక పోలీస్ స్టేషన్ వెళ్లినా ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినా ప్రజా ప్రతినిధులకు విలువలేదని మాజీ ఎమ్మెల్యే ఆయన కుమారులు అధికారులకు ఫోన్లు చేస్తే తప్ప తమ పనులు జరిగేవి కావని ఈ సందర్భంగా మీడియా ముందు దామోదర్ రెడ్డి వాపోయారు.

# ఘనంగా దిలీప్ కుమార్ గౌడ్ 60 వ జన్మదిన వేడుకలు



**కూకట్‌పల్లి, మార్చి 06 (ప్రజా జ్యోతి) :** శేర్లింగంపల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు దిలీప్ కుమార్ గౌడ్ 60 వ జన్మదిన వేడుకలు కూకట్ పల్లిలో గల చిత్తరమ్మ ఆలయంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని పలువురు నాయకులు ఆయనకు కేకులు కట్ చేసి, శాలువాతో సత్కరించి, పూలబుకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 60 సంవత్సరాల వసంతకాలంలో గుర్తుతెలియని వ్యక్తులకు సహాయం చేసిన వ్యక్తి దిలీప్ కుమార్ గౌడ ని ప్రశంసించారు. అలాగే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, మాజీ కార్పొరేటర్ బాబురావు, బస్వంత్ రాజ్ ముదిరాజ్, ఏకాంత గౌడ్, బాష్పాక యాదగిరి, శివ, విష్ణు, ఉదయ్, వెంకటేష్ , యాదగిరి మేస్త్రి, వనం ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి..!

- తహసిల్దార్‌కు వినతిపత్రం

**నందిగామ, మార్చి 06(ప్రజాజ్యోతి):** నందిగామ మండల కేంద్రంలో రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 621 లోని ప్రభుత్వ భూమి ఒక ఎకరా 20 గుంటల భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి అని నందిగామ తహసిల్దార్ కు సిపిఐ మండల కార్యదర్శి ఎం డి షకీల్, గడ్డం జంగయ్య, శంకర్ లు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందిగామ మండలంలో వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూములను చెరువులను కుంటలను కబ్జాలు చేసి కోట్ల రూపాయలు దండుకుంటున్న వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూములను చెరువులను కుంటలను కబ్జాలు చేసి కోట్ల రూపాయలు దండుకుంటున్న వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నారీ శక్తివందన్ కార్యక్రమం

- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ మార్చ్ 6(ప్రజా జ్యోతి )** బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని స్థానిక ఐడిపిఎల్ చౌరస్తా లోని జై కన్వెన్షన్ లో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నారీ శక్తి వందన్ కార్యక్రమానికి ముఖ్య అతితిగా మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ నారీశక్తి బంధన్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి మహిళ సోదరీమణులను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మహిళా మోర్చా నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని వర్చువల్ గా వీక్షించారు. ప్రధాని నరేంద్ర మోడీ పదేళ్ల పాలనలో మహిళల కొరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, చట్టసభల్లో మహిళ రిజర్వేషన్లు తీసుకొచ్చిన ఘనత నరేంద్ర మోడీ దక్కుతుందని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి మెజారిటీ సీట్లు గెలిచి మళ్ళీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, పున్నారెడ్డి, పరుష వేణు, దుర్యోధనరావు, కంది శ్రీరాములు, రాజేశ్వరరావు, పులి బలరాం తో పాటు జిల్లా నాయకులు, మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ అలివేలు, పలువురు మహిళా నాయకులు మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చట్టసభల్లో బీసీల వాట సాధన కోసం
# చేస్తున్న మహా పాదయాత్రలో తూము వినయ్ కుమార్



**కుత్బుల్లాపూర్ మార్చ్ 6(ప్రజా జ్యోతి )** చట్టం సభలో బీసీ వాటా సాధనకై మార్చి 1వ తారీకు బత్తుల సిద్దేశ్వరులు హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు వారి కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ మహా పాదయాత్ర ఆరవ రోజుకి హైదరాబాద్ కి చేరుకోవడం జరిగింది, ఈ మహా పాదయాత్రకి కూకట్పల్లి వాస్తవ్యులైన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ (ఓ బి సి) వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర బీసీ వికాస సమితి అధ్యక్షులు బాశెట్టి నర్సింగ్ రావు, మేడ్చల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ, గాజుల అవినాష్, శ్రీకాంత్, కుమార్ తదితరులు తరలి వెళ్లి వారికి మద్దతు తెలియడం జరిగింది, ఈ మహా పాదయాత్ర అసెంబ్లీ ముందు ఉన్న అమరుల స్థూపానికి చేరుకొని వారికి ఘన నివాళులర్పించారు, అదేవిధంగా అక్కడి నుంచి ట్యాంక్ బండ్ పైన ఉన్న మహనీయుల విగ్రహాల పక్కకి పుంజాల శివశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు తెలియజేస్తూ సర్దార్ పుట్టం పురుషోత్తం రావు ఆధ్వర్యంలో ట్యాంక్బండ్ పై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి యాత్రని కొనసాగించారు, ఈ సందర్భంగా తూము వినయ్ కుమార్ మాట్లాడుతూ ఏదైతే మీ ఈ విన్నపం ఉందో దీన్ని ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు మిగతా మంత్రుల దృష్టికి తీసుకు వెళ్తానని సానుకూలంగా స్పందించడం జరిగింది.

# పేదింటి బిడ్డకు ప్రభుత్వం చేతుల మీదుగా నియామకం

- గురుకుల ఉపాధ్యాయురాలిగా జోగు నిర్మల

**కుత్బుల్లాపూర్ మార్చ్ 6(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ / పేదింటి బిడ్డకు పెద్ద సంతరించుకుంది,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గురుకుల నియామకాలలో ఆమె పడిన కష్టం విజయాన్ని వరించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపే దిశగా చేపట్టిన గురుకుల నియామకాలలో టిజిటి తెలుగు ఉపాధ్యాయురాలిగా,మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టకు చెందిన జోగు నిర్మల,వైఫ్ఆఫ్ వెంకట నరసయ్య తన ప్రతిభను మెచ్చిన ప్రభుత్వం, సోమవారం ఎల్బీ స్టేడియంలో జోగు నిర్మలకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎల్బీ స్టేడియంలో జోగు నిర్మలకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



### క్రమబద్ధీకరణ పేరుతో నిరుపేద ప్రజలను

# దోచుకోవడమేనా ప్రజా పాలన?

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద

- కాంగ్రెస్ అంటే కష్టాలు.. కష్టాలు అంటేనే కాంగ్రెస్ అనేలా తయారైంది రాష్ట్రంలో పాలన తీరు



**కుత్బుల్లాపూర్ మార్చ్ 6(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఇళ్ల క్రమబద్ధీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను ఎండగడుతూ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూగతంలో ఎల్ఆర్ఎస్ వద్దు, భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ మాట తప్పింది.అప్పుడు అడ్డగోలుగా మాట్లాడిన ఇప్పటి కాంగ్రెస్ మంత్రులు ,ఇప్పుడు నోరు ఎందుకు తెరవడం లేదు అని ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్ అంటే ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడమే అన్న కాంగ్రెస్ నేతలు%ూ% ఇప్పుడు ప్రజల నుంచి ఎందుకు డబ్బులు దోపిడీ చేస్తున్నారో చెప్పాలి. అప్పుడు ఎల్ఆర్ఎస్ వద్దు అంటూ మాట్లాడిన రేవంత్, భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎందుకు మౌనం వహించారో ప్రజలకు చెప్పాలి. ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల మంది పైన కనీసం లక్ష రూపాయల భారం పడనున్నది కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల క్రమభద్దీకరణ చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఉచితంగా భూ క్రమబద్ధీకరణ చేయాలని నాడు అరిచి గీపెట్టిన కాంగ్రెస్ నాయకులులి నేడు అధికారంలోకి రాగానే మార్చి 31 తేదీ లోపు రుసుమును చెల్లించి భూ క్రమబద్ధీకరణ చేసుకోవాలని ఫోన్ ద్వారా దరఖాస్తుదారులకు సమాచారం అందించడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు 100 రోజులు పూర్తికావడానికి ఇంకా 7 రోజులు మాత్రమే మిగిలి ఉందని... ఈ వందరోజుల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని, కష్టాలు అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటేనే కష్టాలు అనే విధంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. 100 రోజులు పూర్తయిన తెల్లారి నుంచే ప్రజల పక్షాన పోరాడుతూ ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ సత్తాచాటుతాం. అనంతరం భూ క్రమబద్ధీకరణకు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా చేపట్టాలని కోరుతూ కుత్బుల్లాపూర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కు ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్లు,కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య విద్యానికేతన్ హై స్కూల్లో ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



**కుత్బుల్లాపూర్ మార్చ్ 6(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గాజులరామారం డివిజన్, శ్రీనివాస్ నగర్, లెనిన్ నగర్ లోని చైతన్య విద్యానికేతన్ హై స్కూల్ లో సైన్స్ ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ శివరాత్రి శృతి విద్య , ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి పాల్గొని శ్రీనివాస్ నగర్ లెనిన్ నగర్ లోని చైతన్య విద్యానికేతన్ లో బుధవారం ఏర్పాటుచేసిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన 2024 ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో చక్కగా రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శన ను ఆయన అభినందించారు. చిన్నప్పటి నుంచే శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పించే దిశగా పాఠశాల కృషి చేయడం సంతోషకర మన్నారు. విద్యార్థుల తమ నైపుణ్యాన్ని మోడల్స్ రూపంలో తయారు చేయడం కాకుండా చక్కగా వివరణ చేశారని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుందన్నారు టీచర్లు విద్యార్థులను ఎంతో చక్కగా తీర్చిదిద్దారని కొనియాడారు. పాఠశాలలో ఏర్పాటు చేసే కార్యక్రమాలకు విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తిగా సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ వేడుకలలో విద్యార్థులు తమ సైన్స్ ప్రాజెక్ట్స్‌తో విద్యార్థుల తల్లితండ్రులను, ఉపాధ్యాయులను ఆకర్షించారు. ఈ కార్యక్రమం లో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,పాఠశాల కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి. డైరెక్టర్ మంగ దేవి, డాక్టర్ శృతి విద్య,స్కూల్ ఇంచార్జ్ శారద, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి ముస్తాబవుతున్న నందీశ్వర క్షేత్రం

- ఈనెల 8, 9, 10న మూడు రోజుల బ్రహ్మోత్సవ జాతర ఉత్సవాలు

- కన్నుల పండువగా ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలు

- పాల్గొనే భక్తులకు ప్రజలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



**యాచారం, మార్చి 06 (ప్రజాజ్యోతి):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధి నందివనపర్తిలో కొలువైన నందీశ్వర మహాక్షేత్రం జాతర బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతూనే నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఏడు అడుగుల మహానంది శివలింగం, అమ్మవారి విగ్రహాలు ఆకర్షణీయంగా అలంకరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్దదైనా, కళాత్మకమైన నంది విగ్రహం నందివనపర్తిలో కొలువుదీరడంతో శివరాత్రి పర్వదినాన జాతర ఉత్సవాలకు మండలంలోని ప్రజలతో పాటు ఇతర జిల్లాల నుంచి ప్రజలు, భక్తులు తరలివస్తారు. ఇక ఈ నెల 8, 9, 10 మూడు రోజుల బ్రహ్మోత్సవ జాతర ఉత్సవాలకు తరలిరానున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆలయ అనువంశిక ధర్మకర్త పల్ల జయేందర్ తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీ నందీశ్వర ఆలయమునందు శివపార్వతి కళ్యాణ మహోత్సవము, అభిషేకాదులు, రథమహోత్సవము, బిల్వార్చన మొదలగు కార్యక్రమాలను నిర్వహిస్తారు. శివలింగము, నందీశ్వరుడు, హనుమాన్, కుమారస్వామి, వినాయకుడు, మహంకాళి, నాగదేవతలు, ప్రభూతి విగ్రహ పరివేష్టితమై శ్రీశ్రీశ్రీనందీశ్వర మహా క్షేత్రంగా ప్రసిద్ధి గాంచినది. ఆలయంలో ఆకాల మృత్యుహరణము, సర్వవ్యాధి నివారణం, గ్రహబాధ నివారణ, సంతానము లేని వారికి సంతానము కలుగునని ప్రతీతి.

**బ్రహ్మోత్సవ కార్యక్రమాలు**

బ్రహ్మోత్సవాల్లో ఈ నెల 8న శుక్రవారం ఉదయం 6 గంటలకు అఖండ దీపారాధన, కలశ స్థాపన, గణాధిపతిపూజ, మండపారాధన, ధ్వజారోహణము, నిరంతర ఏకాదశ రుద్రాభిషేకములు రాత్రి 8 గంటలకు మహాశివరాత్రి జాగారము, రాత్రి 12 గంటలకు లింగోద్భవం, .09న శనివారం అభిషేకాదులు, ప్రత్యేక పూజలు, అన్నదానము, సాయంత్రం 6 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం, 10న ఆదివారం ఉదయం 6 గంటలకు రథోత్సవము, అభిషేకాదులు, శ్రీ పార్వతి దేవి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, అష్టదిక్పాలక బలి, ముగింపు పూజ, అన్నదానము వివిధ కార్యక్రమాలు అంగర వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

## రవీంద్రభారతిలో జిహెచ్ఆర్టి పురస్కారాల ప్రధానోత్సవం

- పురస్కారాలను బహూకరించిన ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి

- వివిధ రంగాల్లో కృషి చేసిన 40 మంది పురస్కారాలకు ఎంపిక



**ఇబ్రహీంపట్నం, మార్చి 06 (ప్రజాజ్యోతి):** అంతర్జాతీయ శాంతి సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి జి హెచ్ ఆర్ టి పురస్కారాలకు ఎంపికైన వారికి పురస్కారాలను ప్రధానం చేశారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఇండియా (జిహెచ్ఆర్టి ఇండియా) ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతిలో అంతర్జాతీయ శాంతి సదస్సును నిర్వహించింది. ఐక్యరాజ్యసమితిలో ప్రత్యేక హోదాను కలిగిన జిహెచ్ఆర్టి ఇండియా ఒక అంతర్జాతీయ సంస్థ కాగా వివిధ రంగాలలో కృషి చేసిన 40 మందిని గౌరవ పురస్కారాలకు జిహెచ్ఆర్టి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా మార్చి 5 న నిర్వహించిన అంతర్జాతీయ శాంతి సదస్సులో ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జిహెచ్ఆర్టి నిర్వాహకులతో కలిసి ఎంపికైన వారికి గౌరవ పురస్కారాలను ప్రధానం చేశారు. ప్రపంచంలో ఉన్న ప్రతి వ్యక్తి మనసులో హృదయాన్ని కదిలించే జీవిత చరిత్రలు చెక్కబడి ఆ చరిత్రలను మహోన్నతంగా తీర్చిదిద్దిన అసాధారణ వ్యక్తులకు ఈ పురస్కారాలు అందజేస్తారని పురస్కారాలు అందజేసిన జిహెచ్ఆర్టిని పురస్కారాలు పొందిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం జిహెచ్ఆర్టి నిర్వాహకులు ఎమ్మెల్యేకు జ్ఞాపికను బహుకరించి సన్మానించారు. ప్రధాన ఉత్సవంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, జిహెచ్ఆర్టి తెలంగాణ ప్రెసిడెంట్ నాయినంపల్లి శ్రీనివాస్, జిహెచ్ఆర్టి సెక్రటరీ జునైద్ రఫీక్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ రేణుక లింగాల, ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్ ఫహీంసయ్యద్, జిహెచ్ ఆర్ టి తెలంగాణ డైరెక్టర్ సైయిదా సీమా ఫాతిమా, సయీద్ సయ్యద్ మహమూద్ అర్ఫత్ యదుల్లాహి, పరమజీత్ సింగ్, జిహెచ్ఆర్టి సెక్రటరీ జునైద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రజా దీవెన సభకు తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు..!



**నందిగామ, మార్చి 06 (ప్రజాజ్యోతి):** నందిగామ మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జంగ నరసింహ ఆధ్వర్యంలో పాలమూరు ప్రజా దీవెన సభకు భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్ళినారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొమ్ము కృష్ణ, కుమార్ గౌడ్, బుచ్చయ్య, శ్రావణ్ కుమార్, కృష్ణ, నరసింహ, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ విగ్రహం సర్కిల్ వద్ద ఆటోవాలాల ఆగడాలు




కుత్బుల్లాపూర్ మార్చ్ 6(ప్రజా జ్యోతి ) ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన ,విభాగిని పోల్స్ ప్లాస్టిక్ వి ఉండటంతో , ఆటో డ్రైవర్లు ప్లాస్టిక్ వీభాగిని ల పై నుండి రోడ్డు దాటుతూ ,రోడ్డుపై వెళ్ళే ఇతర వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తూ,ట్రాఫిక్ సమస్యకు కారణవ-ఎవుతున్నారు, అంతే కాకుండా ట్రాఫిక్ ప్లాస్టిక్ పోల్స్ పై వాహనాలు నడపడం పోల్స్ విరిగిపోవడం ద్వారా ప్రజా ధనం దుర్వినియోగం కావడానికి కారణమవుతున్న ఆటో డ్రైవర్లు, కావున ట్రాఫిక్ సిబ్బంది ఇందిరాగాంధీ సర్కిల్ వద్ద ప్రత్యేక దృష్టి సారించి ఆటో డ్రైవర్లు ఆగడాలను అడ్డుకుని ట్రాఫిక్ సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూల బొకే అందజేసిన

## కేశంపేట జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి



కొత్తూరు మార్చి 06 (ప్రజా జ్యోతి) మహబూబ్ నగర్ లో ప్రజా దీవెన సభ వేదికపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పులబొకేతో కేశంపేట జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి స్వాగతం పలికారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వాలు మరింత కృషి చేయాలి

- తహసిల్దార్ సునీత
- బస్‌స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- ప్రతిభ కనబరిచిన మహిళా కండక్టర్లకు ప్రశంసా పత్రాలు




ఇబ్రహీంపట్నం, మార్చి 06 (ప్రజాజ్యోతి): మార్చి 8 న శుక్రవారం నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా డిపో మేనేజర్ వెంకట నర్సప్ప ఆధ్వర్యంలో బుధవారం బస్ స్టేషన్ ఆవరణలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ సునీత పాల్గొని మహిళా కండక్టర్లను మహిళా ప్రయాణికులను సత్కరించి ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళా కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మహిళలు లేనిదే మనుగడ లేదని నేటి సమాజంలో మహిళలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులను నియంత్రించేందుకై ప్రభుత్వాలు మరింత కట్టుదిట్టమైన చట్టాలను అమలు చేయాలని తహసిల్దార్ కోరారు. మహిళల పురోభివృద్ధికి, సాధికారతకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి.సరస్వతి, అసిస్టెంట్ ఇంజనీర్ సత్తయ్య, సూపరిండెంట్ చంద్రశేఖర్, వెల్ఫేర్ కమిటీ సభ్యులు వైవిరెడ్డి మల్లికాబేగం ఇతరులున్నారు.

## విజయవంతంగా ముగిసిన పల్స్ పోలియో



మల్కాజిగిరి, మార్చి 6, (ప్రజాజ్యోతి): మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగి సింది. ఆదివారం ప్రారంభ మైన పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్ర మంలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్ల చిన్నారులందరికీ పోలి యో చుక్కలు మందు వేశారు. ఆ రోజు పోలి యో డ్రాప్స్ వేయిం చుకో ని వారిని గురించ టం కోసం వైద్య సిబ్బంది సోమ, మంగళ వారాల్లో ఇంటి ఇంటికి వెళ్ళారు. సంబంధిత చిన్న పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు మందు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సూపర్ వైజర్ , ఏఎన్ ఎంలు,ఆశా కార్యకర్తలు, ఆర్పీలు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలు

- ఈనెల 4 నుంచి 23 వరకు దరఖాస్తులు సమర్పణ
- 6, 7, 8, 9 తరగతులకు వచ్చే నెల 21న ప్రవేశ పరీక్ష
- ప్రిన్సిపల్ కూకుట్ల యాదయ్య



యాచారం, మార్చి 06 (ప్రజాజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 6, 7, 8, 9 తరగతులలో అందుబాటులో గల ఖాళీలను భర్తీ చేయుటకు అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నావని ప్రిన్సిపల్ కూకుట్ల యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు 04 మార్చి 2024 నుండి 23 మార్చి 2024 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు సమర్పించవలసి ఉంటుందని యాదయ్య తెలియజేశారు. తెలంగాణ వ్యాప్తంగా కేటాయించిన కేంద్రాలలో వచ్చే నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తు విషయంలో ఏ సందేహాలున్నా దగ్గరలోని ఏదైనా గురుకుల విద్యాలయాన్ని సందర్శించి అనుమానాలన్నీ నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## వినూత్నమైన నిరసన తెలిపిన రాయపురపు సాంబయ్య



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి06, (ప్రజాజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో బుధవారం కాంగ్రెసు పార్టీ సీనియర్ నాయకులు రాయపురపు సాంబయ్య వినూత్నమైన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లో ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీ చిత్ర పటానికి మెకాళ్ళ పై కింద కూర్చోని తల్లి సోనియా గాంధీ కి దండం పెడుతూ మా కులస్థులకు టిక్కెటు ఇవ్వాలంటూ వేడుకున్నారు. జై సోనియా గాంధీ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్కె అమీర్ పాషా, షరీఫ్, వేలుగు శ్రీకాంత్ రాయపురం సంపత్, కట్టా పాపయ్య, రాగ మల్లయ్య ఉంద్రాతి కరుణాకర్, రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందించాలి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి06 (ప్రజాజ్యోతి ): మహబూబాబాద్ జిల్లాలో ఎటిగడ్డ తండా, రైతు వేదిక నందు ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, సంబంధిత అధికారులు, రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు, రాష్ట్రంలోని (110) రైతు వేదికలలో రైతు నేస్తం అనే కార్యక్రమన్ని బుధవారంహైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందించడం కోసం రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని రైతులకు సీజనల్ వారిగా ఎప్పుడు ఏ పంటలు వేయాలిని ఏ ఎరువులు వేయాలిని భూమి యొక్క సాంద్రత పంటలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు, (26)రకాల పంటల కు వానాకాలం, రబీ సీజన్లో ఏ పంటలు వేయాలి అనే అంశం తెలుసుకోవచ్చని తెలిపారు, పంటలపై బీమా సౌకర్యం కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు, మహబూబాబాద్ జిల్లా లో రైతు నేస్తం కార్యక్రమంపై విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని వారు తెలిపారు, ఈ వీడియో కాన్ఫరెన్స్ లో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ భగవాన్ రెడ్డి, డివిఓ అభిమన్యుడు, ఏడిఏహౌలక్ష్మి నారాయణ, ఎంఎఓహౌరుపతి, ఏఈఓ పూజిత, వెటర్నరీ డాక్టర్ రాజేష్ రెడ్డి, కేవికే మల్యాల్ శాస్త్రవేత్త కిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పసుపులేటి రామారావు భౌతిక కాయానికి నివాళులు అర్పించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



**గార్ల,మార్చి 06(ప్రజా జ్యోతి)** గార్ల మండల ఎంపీటీసీ:2 శ్రీమతి పసుపులేటి సుజాత గారి భర్త కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పసుపులేటి రామారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు, ఈరోజు గార్ల నుండి హైదరాబాద్ కు చికిత్స కోసం కుటుంబసభ్యులతో వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందారు, రామారావు మృతి చెందిన విషయం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ద్వారా తెలుసుకున్న ఇల్లందు శాసనసభ్యుడు కోరం కనకయ్య, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి గార్లు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ ఎప్పుడు అండగ ఉంటుందని ధైర్యం చెప్పారు, ఈ కార్యక్రమంలో గార్ల మండల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండా వెంకట్ రెడ్డి, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మీ, గార్ల ఎంపిపి బట్టు నాగరాజు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మాలోత్ వెంకట్ లాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్, గార్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనియాకుల రామారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణ గౌడ్, సొసైటీ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్ కుమార్, శ్రీ శక్తి అవార్డు గ్రహీత శంషాద్ బేగం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు షేక్ యాకుబ్ పాష, బిక్షపతి గౌడ్, రమేష్, శ్రీకాంత్ మండల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు...

## రజకులకు దోబీ ఘాట్ స్థలాన్ని తిరిగి అప్పగించాలి

– అఖిలపక్ష నాయకుల డిమాండ్



**మల్కాజిగిరి, మార్చి 6, (ప్రజాజ్యోతి):** మల్కాజిగిరిలో రజకులకు దోబీ ఘాట్ లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి స్థలాన్ని తిరిగి వారికే అప్పగించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం నాయ కులు, మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ రాజు ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మల్కాజి గిరి లో రజక వృత్తిని జీవనోపాధిగా చేసుకుని ఇక్కడే నివసిస్తున్న 300 రజక కుటుంబాలకు 1985 లో జ్యోతి నగర్ లో ప్రభుత్వం దోబీఘాట్ ను నిర్మించి ఇచ్చిందన్నారు. కొన్ని సంవత్సరాల తర్వా త ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో, దానిని తిరిగి మరల నిర్మిస్తామని మాజీ కార్పొరేటర్ వాగ్దానం చేసి, దీని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి పార్కు ను ఏర్పాటు చేశారని చెప్పారు. ఇప్పుడు ఆ కాలనీ వాసులు గేటుకు తాళం వేసి, రజకులను రాకుం డా చేసి,ఇదేమని అడిగితే వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కఠిన చర్యలు తీసుకుని,రజకుల స్థలా న్ని తిరిగి వారికే అప్పగించాలని అఖిలపక్ష నాయ కులు కమిషనర్ ను కోరారు. దీనికి ఆయన సాను కూలంగా స్పందించి, విచా రణ జరిపి, ఆ స్థలాన్ని రజకులకు అప్పగించేం దుకు తగు చర్యలు తీసు కుంటానని హామీ ఇచ్చి నట్లు అఖిల పక్ష నాయ కులు చెప్పారు. ఈ కార్య క్రమంలో రజక సంఘం కార్యదర్శి కాసర్ల నాగరా జు, సిపిఐ నాయకులు రొయ్యల కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు పిట్టల శ్రీనివాస్, టి. వెంక టేష్ యాదవ్, డీకే శ్రీను, టిడిపి నాయకులు వగ్గు చంద్రశేఖర రావు, కరణం గోపి, బిజెపి నాయకులు ప్రకాష్, బీఎస్పీ నాయకు లు గౌతమ్ రాజ్, జి.రమే ష్, బీసీ సంఘం నాయకులు కామల్ల ఐలన్న, బత్తిని నరసింహ గౌడ్, అప్పల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు పి.ప్రవీణ్ కుమార్, పి.సత్యనారా యణ, ఆర్. యాదగిరి, కిరణ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ ఆర్ ఎస్ ఫీజు వసూలు వద్దు : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి, మార్చి 6, (ప్రజాజ్యోతి):** ఎల్ ఆర్ ఎస్ పేరిట ఫీజు వసూలు ను నిలిపి వేసి, ఉచితంగా క్రమబద్ధీకరణ చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షు డు కేటీఆర్ ఇచ్చిన పిలు పు మేరకు బుధవారం మల్కాజిగిరి నియోజక వర్గం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అల్వాల్ సర్కిల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కు మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని మల్కాజిగిరి, గౌతంనగర్, ఆనంద్ బాగ్, మౌలాలి, వినాయక్ నగర్, నేరేడ్ మెట్ డివిజన్ల నుంచి బీఆర్ ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు. ఈ ధర్నా నుద్దే శించి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్ఆర్ ఎస్ ఉచితంగా క్రమబద్ధీ కరణ ను అమలు చేస్తా మని హామీ నిచ్చిందన్నా రు. అధికారంలోకి వచ్చాకా, ఇప్పుడు ఎల్ ఆర్ స్ క్రమబద్ధీకరణ ఫీజు పేరిట రూ 20 వేల కోట్లు వసూలు చేయా లని చూస్తుందని విమ ర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్ క్రమబద్ధీకరణ పేరిట ప్రజలపై భారం మోప కుండా, ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్ ఉచి తంగా క్రమబద్ధీకరిం చాల ని ఆయన డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు సబిత అనిల్ కిషోర్, శాంతి శ్రీని వాస్ రెడ్డి, ఏకె.మురుగేష్, సీనియర్ నాయకులు బద్దం పరు శురామరెడ్డి, మేకల రామ–ుయాదవ్, జీకే హను మంతరావు, అనిల్ కిషోర్ గౌడ్, దుంబాల సత్తయ్య , ఇబ్రహీం, సూర్య ప్రకాష్, వాసగోని.శ్రీనివాస్ గౌడ్, ఎండి అలీ, గౌలీకర్ శైలేంధర్, కాశీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## మహిళా సాధికారతతో సుసంపన్న సమాజ స్థాపనే 'నారిశక్తి వందన్' లక్ష్యం

–.కార్పొరేటర్ గున్నాల సునీత చంద్రశేఖర్ యాదవ్





**మౌలాలి, మార్చి 6, (ప్రజాజ్యోతి):** మహిళా సాధికారతతో సుసంపన్న మైన సమాజాన్ని సృష్టించడమే నారిశక్తి వందన్' కార్యక్రమం లక్ష్యమని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత చంద్ర శేఖర్ యాదవ్ అన్నారు. బుధవారం తన కార్యాల యంలో ఏర్పాటు చేసిన 'నారిశక్తి వందన్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. మహిళలు తమ నైపుణ్యాల ద్వారా వారి విజయాన్ని, ప్రాధా న్యతను చాటి చెప్పుకోవ డానికి 'నారీ శక్తి వందన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ లో నారి శక్తి వందన్ పేరుతో మహిళ లకు వందన కార్యక్రమా న్ని నిర్వహించారని తెలి పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి పార్లమెంట్ నియోజ కవర్గంలో నిర్వహిస్తున్న ట్లు చెప్పారు. బీజేపీ అధిష్టానం ఆదేశాల మేర కు మల్కాజిగిరి పార్ల మెం ట్ నియోజక వర్గం పరిధి లోని మౌలాలి డివిజన్ లో నేడు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె చెప్పారు.గత 10 సంవ త్సరాల బీజేపీ పాలనలో మహిళల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అవిరళ కృషి చేస్తుందన్నారు. ఈ సంద ర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. ముఖ్యంగా మహిళా సంఘ సభ్యుల కు అమలు చేస్తున్న పథ కాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరా రు. మహిళలకు చట్ట సభ ల్లో 33 శాతం రిజర్వే షన్ బిల్లు పార్లమెంట్ లో ప్రవే శ పెట్టడం జరిగిందన్నా రు. ముస్లీం మహిళలకు త్రిపుల్ తలాక్, ఉజ్వల యోజన పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరు, వీధి వ్యాపా రులకు ముద్రా రుణాలు, బేటీ పడావో, బేటీ బచా వో, సుకన్య సమృద్ధి యోజన, పొదుపు మహిళా సమాఖ్యలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని తెలి పారు. మహిళల స్వాభి మాన హక్కులు కాపాడ టానికి ఇంకా అనేక పథ కాలను ప్రవేశ పెట్టార న్నారు. కేంద్రంలో మళ్లీ భారతీయ జనతా పార్టీ యే అధికారంలోకి వస్తోం దని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మన దేశంలోని మహిళలు అందరూ నరేంద్ర మోడీకి మద్దతు ఇవ్వాలని కోరారు.అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అత్య ధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుంద న్నారు. త్వరలో జరగ బో యే ఎన్నికల్లో మల్కాజిగి రి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిం చారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి అసెంబ్లీ కన్వీ నర్ డిఎన్ వెంకటేష్, సీని యర్ నాయకుడు వాసు దేవ రావు,బీజేపీ మౌలాలి డివిజన్ అధ్యక్షుడు అని పెద్ది సాయిబాబు, మేకల మోహన్ యాదవ్, మహి ళా అధ్యక్షురాలు రాధా బాయ్, బబితా దూబే, పొదుపు సంఘాల మహి ళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 'ఈటల'ను మర్యాద పూర్వకంగా కలిసిన బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు



**మౌలాలి, మార్చి 6, (ప్రజాజ్యోతి):** మల్కాజిగిరి పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ ని ప్రకటించిన సందర్భంగా బుధవారం బీసీ కులాల ఐక్య వేదిక మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని నాయకులు ఆయనను, మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకే అందచేసి, శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకు లు రొయ్యల కృష్ణమూర్తి ముదిరాజ్, వగ్గు చంద్ర శేఖర్ రావు, బత్తిని నర్సిం హాగౌడ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ని బీసీ కులస్థులు ఆయనకు సంపూర్ణ మద్దతు నిచ్చి , ఓట్లు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించు కోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

## శ్రీ కేతకి సంగమేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు





**ఝరాసంగం, మార్చ్ 06( ప్రజా జ్యోతి న్యూస్ )** తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ సేవ క్షేత్రాల్లో ఒకటైన దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి వారి దేవాలయం లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు భారీ సంఖ్యలో హాజరు కాలున్నారు. అందుకు గాను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జహీరాబాద్ ఆర్డిఓ రాజు అధికారులతో ఇప్పటికే సమీక్ష సమావేశం నిర్వహించారు. అందుకు అనుకూలంగా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. స్థల పురాణం.ఝరాసంగం క్షేత్రంలో శివలింగాన్ని సాక్షాత్ బ్రహ్మదేవుడు ప్రతిష్ఠించినట్లు ఇక్కడి స్థల పురాణాల ద్వారా తెలుస్తుంది. కృతయుగంలో సూర్య వంశానికి చెందిన కృపేంద్ర అనే రాజు చర్మవ్యాధితో బాధపడుతూ ఉండేవాడు. తన వ్యాధి నివారణకు ప్రతి రాజు చేసిన ప్రయత్నం విఫల మైంది. ఒకానొకప్పుడు రాజు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇక్కడున్న కేతకి వనంలో ఉన్న నీటి గుండంలో స్నానం చేశాడు. అతనికి పూర్తిగా స్వస్థత చేకూరిందట. రోజు రాత్రి రాజుకి సంగమేశ్వర స్వామి కలలో కనిపించి తానక్కడ ఉన్నానని. శివలింగాన్ని వెలికి తీసి ఆలయాన్ని నిర్మించుకొని ఆదేశించాడట. అక్కడున్న నీటి గుండాన్ని పుష్కరినిగా మార్చి దానికి అష్ట తీర్చమని, అమృత గుండంగా పేరు పెట్టినట్లు ఇక్కడి ఆధారాల ద్వారా అవగతవుతొంది. గర్భాలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి వారి దివ్య మంగళ లింగ రూపాన్ని దర్శించిన భక్తులు అపూర్వమైన ఆధ్యాత్మికా నందానికి లోనవుతారు. మంజీరా నది తీరంలో వెలసిన ఈ స్వామిని సంగమేశ్వర స్వామి అని పిలుస్తారు. కేతకి సంగమేశ్వర స్వామిగా పూజలందుకుంటున్న ఈ స్వామిని మొదట బ్రహ్మదేవుడు కేతకి పుష్పములతో ( కేతకి అంటే మొగిలి పువ్వులతో )పూజించాడట. అని శిలా శాసనాల ద్వారా తెలుస్తుంది.ప్రచారంలో మరో పురాణ గాధ.... స్థల పురాణానికి సంబంధించి మరో పురాణ గాధ ఒకటి ప్రచారంలో ఉంది. పూర్వం కేతకి అనే పరస్పర ఓ ముని శాపంతో కేతకి మొగిలి వనంగా మారిందట. దీంతో శాప విమోచనాన్ని కోరి ఆమె శివుని గురించి ఘోర తపస్సు చేయగా ఆమె భక్తికి మెచ్చిన శివుడు ఇక్కడ బాల లింగ రూపంలో వెలిశాడట. ఆ కారణంగా ఆ స్వామి సంగమేశ్వర స్వామిగా పూజాధి కారులు అందుకుటున్నట్లు తెలుస్తుంది. అలాగే సృష్టి అనంతరం బ్రహ్మదేవుడు శివుడిని కేతకి పుష్పములతో ఆరాధించాడంట. ఆ కారణంగా ఈ స్వామికి కేతకి సంగమేశ్వర స్వామి అనే పేరొచ్చిందంటారు. ప్రధాన ఆలయానికి వెనుక భాగంలో అమృత గుండం దర్శనమిస్తుంది. ఈ గుండంలో స్నానం చేసేవారి చర్మ రుగ్మతలన్నీ పోతాయని భక్తుల విశ్వాసం. అలాగే కాశీలోని గంగా నదిలోని ఓ ఝరా ఇక్కడ నీటి గుండంలో అంతర్లీనంగా కలుస్తుందంటారు. ఆ ఆలయంలో ఏటా మహా శివరాత్రి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ శోభను స్వయంగా చూడలే కానీ వర్ణింప శక్యం కాదు. కార్యక్రమాల వివరాలు. 7 వ తేదీన శేష వాహన సేవ లి 8 వ తేదీన మహాశివరాత్రి అగ్ని ప్రతిష్ట గణపతి హోమం స్వామివారికి అభిషేకం రాత్రి లింగోద్భవ సమయమున మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం,ఋుద్వీకరణ, పల్లకి సేవ, భజనలు. లి 9 వ తేదీన స్వామివారికి అభిషేకము, అమ్మవారికి కుంకుమార్చన, రుద్ర సహకార హోమము, నవగ్రహ శాంతి హోమము, సాయంత్రం 5 గంటల నుండి నంది వాహన సేవ రాత్రి 12 గంటలకు అగ్నిగుండము పూజా, అగ్ని ప్రతిష్ట. లి లి 10 వ తేదీన ఉదయం 4- 30 గంటలకు స్వామివారికి అభిషేకం అమ్మవారికి కుంకుమార్చన అగ్ని గుండము హోమము ,పూర్ణాహుతి 5-30 గంటలకు శ్రీ పార్వతీ సంగమేశ్వర స్వామి కళ్యాణము, రాత్రి 10- 30 నిమిషాలకు వారి విమాన రథోత్సవం. 13 వ తేదీన స్వామివారికి అభిషేకం అమ్మవారికి కుంకుమార్చన లక్ష బిల్వార్చన ,పల్లకి సేవ, అన్నదానం.

## అక్రమంగా భూరికార్డ్ మార్పిడి

### - న్యాయం చేయాలని ఎమ్మార్వోకి వినతి



**ప్రజా జ్యోతి, సిద్ధిపేట, కొండపాక :** మూడు దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న భూమిని దుద్దెడ కు చెందిన నర్ర ప్రతాప్ రెడ్డి అనే వ్యక్తి 15 సంవత్సరాల క్రితం అక్రమంగా పట్టా మార్పిడి చేశారని మండల పరిధిలోని దుద్దెడ గ్రామానికి చెందిన జక్కుల బాలయ్య, రాకేష్ లు ఎమ్మార్వో కు బుధవారం వినతిపత్రం అందజేశారు. దుద్దెడ గ్రామంలోని 652 సర్వే నెంబరు గల 31 గుంటల భూమిలో గత ముప్పై సంవత్సరాల నుండి కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నామని జక్కుల బాలయ్య, రాకేష్ లు తెలిపారు. వంశపారపర్యంగా జక్కుల బాలయ్య తండ్రి కొమురయ్య కు రావలసిన పట్టా భూమిని దుద్దెడ కు చెందిన నర్ర ప్రతాప్ రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా పట్టా చేయించుకొని, కొనుగోలు దారులకు వేరే అసైన్డ్ ల్యాండ్ చూపించి 652 పట్టా నంబర్ ను 2013 లో విక్రయించడం జరిగిందన్నారు. ఈ పట్టా నెంబర్ ను పరిశీలించి తమకు న్యాయం చేయాలని ఎమ్మార్వో ను బాధితులు కోరారు.

## తిమ్మక్కపల్లిలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**రాయపోల్: మార్చి 6 (ప్రజా జ్యోతి):** స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఐదవ తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి పాఠశాలలో మిగతా విద్యార్థులకు విద్యాబోధన చేశారని తిమ్మకపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమాన్ దాస్ అన్నారు. రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హనుమాన్ దాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు స్వయంగా ఉపాధ్యాయుల విధుల పట్ల పాఠశాల విధులు సమాజం తీరు పై అవగాహన కలిగే విధంగా నిర్వహించడం జరుగుతుంది. దానిలో భాగంగానే విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి మిగతా తరగతి విద్యార్థులకు ఒకరోజు విద్యాబోధన చేయడం జరిగిందన్నారు. స్వయం పాలన దినోత్సవం లో డీఈవోగా రాహుల్ హెచ్ఎం గా వైష్ణవి శిరీష , మిగతాహావిద్యార్థులు సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రేణు మానస, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 12న కమలాయపల్లిలో విగ్రహాల ఆవిష్కరణ



**సిద్దిపేట టౌన్ ప్రజాజ్యోతి :** ఈ నెల 12 న సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కమలాయపల్లి గ్రామంలో మహాత్మ జ్యోతరావు పూలే, సావిత్రి భాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందని లింగంపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షులు గందమాల యాదయ్యలు తెలిపారు. ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ బయో డీజిల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో జ్యోతిరావు పూలే సావిత్రి భాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం సంబంధించి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విగ్రహాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ లు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు, నాయకులు విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మోత్కూరి మల్లేశం, రాష్ట్ర కార్యదర్శి కొండయ్య, న్యాయవాది రాజలింగం, బాబు రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



**జగదేవపూర్, ఫిబ్రవరి6(ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జగదేవపూర్ , మునిగడప పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు, కనకయ్య అన్నారు. బుధవారం జగదేవపూర్ మండలంలో తిగుల్ ప్రాధమిక పాఠశాలకు గ్రామానికి చెందిన రిటైర్డ్ వార్డెన్ రామకృష్ణ రెడ్డి కంప్యూటర్, మైక్ సెట్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న దాత రామకృష్ణ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రయి-ంవేటు కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతమైన స్థాయిలో ఉన్నవారు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, నందిని, ఉపాధ్యాయులు సంతోష, అమృతమ్మ, స్వాతి, ఎస్ఎంసీ చైర్మన్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**చిన్నకోడూరు మార్చి6(ప్రజాజ్యోతి):** సర్పంచులకు చెల్లించే సుమారు రూ. 1500 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని .ఎస్సీ ఎస్టీ సర్పంచుల ఫోరం జిల్లా కన్వీనర్ జేరిపోతుల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే నిధులను విడుదల చేయకపోతే పార్లమెంటు ఎన్నికల్లో గ్రామాలలోకి వచ్చిన ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికలలోపు నిధులను విడుదల చేయకపోతే. ఆ తదుపరి రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని. భవిష్యత్తు కార్య రచన తెలియజేస్తున్న మన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ నిధుల సుమారుగా 30 నెలలుగా పెండింగ్లో నెలలోగా పెండింగులో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. లేనియెడల పార్లమెంటు ఎన్నికలలో సర్పంచులందరూ పార్లమెంటు అభ్యర్థులుగా నామినేషన్ వేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఫైనాన్స్ నిధుల సుమారుగా 30 నెలలుగా పెండింగ్లో నెలలోగా పెండింగులో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. లేనియెడల పార్లమెంటు ఎన్నికలలో సర్పంచులందరూ పార్లమెంటు అభ్యర్థులుగా నామినేషన్ వేస్తామని హెచ్చరించారు.

## ఆర్టీసీ డిపో మేనేజర్‌కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత



**చిన్నకోడూర్ ,మార్చి7 (ప్రజా జ్యోతి):** గతం లో సిద్దిపేట నుండి చిన్నకోడూర్ మీదుగా ఇల్లంతకుంట వెళ్లే సిద్దిపేట డిపో బస్ గత 3సంవత్సరాలు గా రావడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చెపట్టిన మహా లక్ష్మి పథకం మహిళలకు ఉపయోగపడాలంటే తప్పనిసరిగా మళ్ళీ సిద్దిపేట నుండి చిన్నకోడూర్, మాచపూర్,సలేంద్రి ,కమ్మర్లపల్లి,అల్లీపూర్, కిష్టాపూర్ గ్రామాల మీదుగా ఇల్లంతకుంట వెళ్లే సిద్దిపేట డిపో బస్ ను తిరిగి పునాప్రారంభించి ప్రారంభించాలనే అన్నారు. రోజుకు కనీసం 4 ట్రిప్పులు నడపాలని డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. విషయం పై డిపో మేనేజర్ వెంటనే స్పందించి వారం రోజుల్లోపు సిద్దిపేట నుండి ఇల్లంతకుంట వెళ్లే బస్సు ను మళ్ళీ పునాప్రారంభీస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. బస్సు వేస్తున్నందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో మండల ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరాం, సెక్రటరీ కోరిమి రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉడుత జయంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన మహాసభ రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయండి



**సిద్దిపేట టౌన్ ప్రజాజ్యోతి :** జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో బహుజన రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రాన్ని రిలీజ్ చేశారు. సందర్భంగా బీడీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బేట ఆనంద్ మాట్లాడుతూ బహుజన రాష్ట్ర ప్రధామ మహాసభ ఈ నెల 10న 11 గంటలకు సూర్యాపేటలో పాత బస్టాండ్ పక్కన గల పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించబోతున్నామని తెలిపారు. ముఖ్యఅతిథి మంత్రి దాసరి సీతక్క, ప్రొఫెసర్ చింతకింది కాసిం, పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కన్వీనర్ కె.బహుజన, బహుజన పొలిటికల్ సెంటర్ టీఎస్ దండి వెంకట్, గాజుల శ్రీనివాస్ (బి,ఎఫ్, టి, యు), ధనలక్ష్మి (బహుజన మహిళ సంఘం రాష్ట్ర కన్వీనర్) సిద్ధి రాములు (బి ఎల్ టి యు) మహాసభలో భారత సమాజం వర్ణ కుల వర్గాల జాతుల వివిధ మతాలు భిన్న భాషలు కలిగిన భిన్నత్వల తో కూడిన సమాజం భారతీయ గ్రామం అంటే వర్ణాలతో కులాలతో నిండిన గ్రామం ఈ వర్ణాలు కులాలు సమాంతరమైనవి కావు ఒకదానిపై ఒకటి చేర్చబడి నిటారు తల నిచ్చెన మెట్ల లాగా నిలబడిన నిటారు తల నిచ్చెన మెట్ల వర్ణకుల వర్గ సమాజం వర్ణాన్ని కులాన్ని బట్టి గౌరవ మర్యాదలు అవకాశాలు కల్పించబడతాయి. కాబట్టి ఈ బహుజన మహాసభలో మహనీయుల ఆశయాలు కొనసాగించేందుకు, నెరవేర్చేందుకు ఈ మహాసభలో భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడం కోసం మహాసభలను బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా నిర్వహించబోతున్నామని తెలిపారు కావున ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు,మహాసభను జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో (బి ,ఎఫ్ ,టి యు, సిద్దిపేట జిల్లా నాయకులు వలియోద్దీన్, శ్రీనివాస్, మహేందర్, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట రూరల్ ఉపాధ్యక్షులు ఎర్ర కృష్ణ, రాజయ్య, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి చేయూత

**జగదేవపూర్, ఫిబ్రవరి6(ప్రజాజ్యోతి):** స్నేహితుని కుటుంబానికి చేయూతనిచ్చి తోటి స్నేహితులు అండగా నిలిచారు. గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన నర్సింలు అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న తన తోటి చదివిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం నరసింహులు కుటుంబాన్ని పరామర్శించారు. మృతి గల కారణాలను అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం రూ. 35 వేల ఆర్థిక సహాయాన్ని అందించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ




**చేర్యాల ప్రజాజ్యోతి :** చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఘనంగా, స్వపరిపా దినోత్సవాన్ని అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరుపుకున్నారు. ఈ సమావేశానికి ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా తాడూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. న్యాయ నిర్ణేతగా పెద్దరాజుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవనమ్మ వ్యవహరించారు. కడవెరుగు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బల్ల శ్రీనివాస్ గారు విద్యార్థులను అభినందించారు. పాఠశాల విజేతలకు బహుమతులను అందించారు సిహెచ్ రక్షిత ప్రథమ, ద్వితీయ ఏం పవిత్ర, తృతీయ డీ లిఖిత లకు బహుమతులను అందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం మల్లేశం, బి అజయ్ కుమార్, మల్లికార్జున్, సిఆర్పి రవీందర్, అంగన్వాడి టీచర్లు కే అండల, జి ఉపేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు

# ఆ సారు.. ఎక్కడున్నా సల్లగుండాల..!

### – పంచాయతీ కార్యదర్శి బదిలీ కావడంతో గ్రామస్తుల దుఃఖం



**రాజోలి, మార్చి 06, (ప్రజాజ్యోతి) :** ఆయనేమీ రాజకీయ నేత కాదు.. సినిమా హీరో అంతకన్నా కాదు. కానీ తూర్పు గార్లపాడు గ్రామంలో అభిమానం మాత్రం తక్కువేమీ లేదు. ఇంతకీ ఎవరాయన అనుకుంటున్నారా. రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి ఖలీమ్ గత 8 సంవత్సరాలుగా ఉద్యోగరీతిగా ఉంటూ గ్రామంలో అందరిని ప్రేమగా పలకరిస్తూ ఫ్రెండ్లీగా అందరితో శభాష్ అనిపించుకున్నారు. ఇప్పట్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ముడుపులకు బాగా అలవాటుపడిపోయిన...ప్రస్తుతం సమాజంలో ఒక్కరూపాయి కూడా అవినీతి పాల్పడ్డకోకుండా తన సొంత ఖర్చుతో గ్రామానికి సేవ చేయడంతో పాటు, కరోనా సమయంలో రాజోలి హాస్పిటల్లో కరోనా రోగులకు 70 వేలు విలువగల ఆక్సిజన్ పాయింట్ ఖలీమ్ విరాళంగా ఇచ్చాడు. ఇప్పట్లో పంచాయతీ కార్యదర్శుల్లో కూడా ఇలాంటి వారు ఉంటారా అనిపించేలా చేశాడు. ఇక వివరాల్లోకివెళ్తే...తూర్పు గార్లపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గత 8 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఖలీమ్ బుధవారం బదిలీ అయ్యారు. ఈయన ప్రస్తుతం ఉ ండవెల్లి మండలంలోని కంచుపాడు గ్రామానికి ఉ త్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బదిలీ కావడంతో గ్రామస్తులు కన్నీటికి గురయ్యారు.

### హమాలీ కార్మిక నాయకుడు బొల్లి

# చంద్రయ్య మరణం కార్మిక లోకానికి తీరనిలోటు

### – బాధిత కుటుంబాలను పరమార్శించిన గడిపె మల్లేశ్



**హుస్నాబాద్, మార్చి 06 (ప్రజా జ్యోతి):** శ్రమను నమ్ముకోని తోపుడు బండ్ల సంఘంలో సభ్యుడిగా చేరి ఆదర్శ హమాలి కార్మికుడిగా సంఘంలో పని చేస్తు కుటుంబాన్ని పోషించు కుంటున్న పట్టణంలోని 6వ వార్డులోని చేనేత కాలనిలో నివాసం ఉంటున్న బొల్లి చంద్రయ్య వ్యవసాయ పనులు చేస్తూ పోలంలో పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లి గత రెండు మాసాలుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆనారోగ్యంతో బాదపడుతు మంగళవారం సాయంత్రం మరణించారు. బుధవారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ సిపిఐ నాయకులు, హమాలి కార్మికుల తోకలిసి బొల్లి చంద్రయ్య భౌతికకాయాన్ని సందర్శించి పులమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గడిపె మల్లేశ్ మాట్లాడుతూ బొల్లి చంద్రయ్య అకాల మరణం కార్మికులకు అత్యంత తీరని లోటని బాధిత కుటుంబాలకు భారత కమ్యూనిస్టుపార్టీ(సిపిఐ) ఎప్పుడూ అండగా వుంటుందని గడిపె మల్లేశ్ అన్నారు. అనంతరం హుస్నాబాద్ పట్టణంలోని 8వ వార్డులో దొంతరబొయిన ఎల్లవ్వ,13వ వార్డులో పోలవేణి కృష్ణ,18వ వార్డులో చెన్నూరి ఉప్పలయ్య,19వ వార్డు లో పుసాల యాదగిరి వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి, ఏగ్గోజు సుదర్శన్ చారి, తోపుడు బండ్ల సంఘం నాయకులు సంగ సాయిలు, చామంతుల మల్లయ్య,అవుల చంద్రయ్య, దొంతరబొయిన రాజయ్య, దొంతరబొయిన కనకయ్య, పుసాల, అనిత, సునిత, సూజాత, పిట్టల రమేష్, చేన్నూరి మల్లేశం, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ తీరుపై అనుసరిస్తున్న కాంగ్రెస్ వైఖరిపై టిఆర్ఎస్ నిరసన

### – ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్



**హుస్నాబాద్, మార్చి 06 (ప్రజా జ్యోతి):** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పై అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా బుధవారం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన, ధర్నా కార్యక్రమంలో హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల కుటుంబాలకు లబ్ది జరిగేలా ఎల్ఆర్ఎస్ ను ఎలాంటి చార్జీలు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో గెలవడం కోసం అడ్డగోలుగా ఇచ్చిన హామీలన్నింటిని తప్పకుండా అమలు చేయాలని కుమార్ డిమాండ్ చేశారు.అధికారంలో లేనప్పుడు ఒక తీరుగా అధికారంలో ఉన్నప్పుడు మరొక తీరుగా మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, మంత్రుల వైఖరి పైన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకట్, వైస్ చైర్మన్ అయిలేని అనిత, ఎంపీపీ లకావత్ మానస సుభాష్, ఏఎంసీ చైర్మన్ ఎడబోయిన రజనీ తిరుపతిరెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు వంగ వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండి అన్వర్, హుస్నాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్త బుట్టలు పంపిణీ

– మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకట్




**హుస్నాబాద్, మార్చి 06 (ప్రజా జ్యోతి):** స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 3వ,19వ వార్డులో తడి చెత్త పొడి చెత్త బుట్టల పంపిణీ, బేసిల్ ఫౌండేషన్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పురపాలక సంఘ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న పాల్గొని తడి చెత్త, పొడి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని అన్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం పంపిస్తామని, తడి చెత్తతో ఎరువు తయారు చేసే విధానాన్ని వివరిస్తూ తయారుచేసిన ఎరువులు మొక్కలకు వాడుకోవచ్చని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల బదులు బట్ట సంచులను వాడాలని సూచించారు. హుస్నాబాద్ పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా మార్చుటకు ప్రజలందరూ తమ వంతు కృషి చేయాలని, పట్టణాన్ని స్వచ్ఛ హుస్నాబాద్ గా మార్చాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అయిలేని అనిత రెడ్డి, సానిటరి ఇన్స్పెక్టర్ బాల ఏల్లం, కౌన్సిలర్లు కోమటి స్వర్ణలత, బొజ్జ హరీష్, గోవింద రవి, దొడ్డి శ్రీనివాస్, బేసిల్ ఫౌండేషన్ ఫౌండర్ ఉదయ్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బుర్రకథ రూపంలో విద్య ప్రదాన్యతను వివరించిన చిన్నారులు




**జగదేవపూర్, మార్చి6(ప్రజాజ్యోతి):** జగదేవపూర్ మండల కేంద్రంలో గల అక్షర పాఠశాలలో బుధవారం విద్యా యొక్క ప్రత్యేకత గురించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో గల ఆకాశ్ గ్రూప్ ద్వారా విద్య వినూత్నమైన రీతిలో వివరించారు. ఈసందర్భంగా పాఠశాల కరెస్పాడెంట్ రామస్వామి మాట్లాడుతూ విద్యా దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. చదువుకుంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడం సాధ్యం అవుతుందని అన్నారు. విద్యార్థులు ఇప్పుడి నుంచి ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని అందుకు అనుగుణంగా చదవాలని సూచించారు. చదువు లేకుంటే కలిగే నష్టాలను గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు బుర్ర కథ రూపంలో విద్య ప్రాముఖ్యత తెలిపారు. విద్యార్థుల నృత్యాలు ఆటపాటలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోషి జ్యోతి రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుదర్శన్ ఉపాధ్యాయులు రేణుక ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ బరువు కాదు ఆడబిడ్డ బహుమానం

– బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్



**దుబ్బాక / రాయపోల్ మార్చి 06. (ప్రజా జ్యోతి)** దుబ్బాక నియోజవర్గంలో జన్మించిన మొదటి ఆడబిడ్డకు టీం–కార్తిక ఫౌండేషన్ ద్వారా 5000/– రూపాయల ఫిక్స్ డిపాజిట్ బాండ్. కార్తిక తోబుట్టు కార్యక్రమంలో భాగంగా టీం కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో కత్తి కార్తిక గౌడ్ దుబ్బాక మండలం గంభీర్ పూర్ గ్రామానికి చెందిన గట్టు అఖిల పర్శరాముల దంపతులకు తొలి ఆడబిడ్డ జన్మించిన సందర్భంగా పాప పేరు మీద 5000/– రూపాయల పోస్టల్ ఫిక్స్ డిపాజిట్ బాండ్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చింటూ, మైసయ్య, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నేరటి నరసింహులు, రైతు బంధు చైర్ పర్సన్ ఆశ స్వామి అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మాదారి స్వామి, మంగలి రచ్చయ్య, రాగుల సిద్ధిరాములు గౌడ్ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, అబ్బుల రాజలింగం గౌడ్ మాజీ జడ్పీటీసీ కొత్త దేవి రెడ్డి, ఐరేని సాయితేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులకు ‘పది’ గండం..!

– సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే వారికి పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి

– కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

– సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారిలో ఎక్కువ శాతం పదో తరగతి లోపు వారే

– పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న ఆశావాహులు




**మెట్‌పల్లి ప్రతినిధి, మార్చి 5 (ప్రజాజ్యోతి) :** గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే సర్పంచ్ పదవులకు కేంద్ర ఎన్నికల సంఘం కొత్త నిబంధన తీసుకువచ్చింది. మొన్నటివరకు జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో చదువుతో సంబంధం లేకుండా రిజర్వేషన్ల ఆధారంగా మాత్రమే అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. అప్పటివరకు ఎంతోమంది ఆశవాహులు సర్పంచ్ ఎన్నికల బరిలో చదువుతో సంబంధం లేకుండా ఎన్నికల్లో పోటీ చేసి బరిలో నిలిచారు. అయితే ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు కచ్చితంగా 10వ తరగతి పాస్ అయి ఉండాలని కొత్త నిబంధన తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కచ్చితంగా 10వ తరగతి ఉత్తీర్ణలై ఉండాలి. అయితే ఇటీవల సర్పంచుల పదవీకాలం పూర్తయి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఇప్పటివరకు సర్పంచ్ గా పనిచేసిన వ్యక్తులతో పాటు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్ గా పోటీ చేయడానికి ఎంతోమంది ఎదురుచూస్తున్నారు. అయితే కేంద్ర ఎన్నికల సంఘం తెచ్చిన కొత్త నిబంధన కారణంగా కేవలం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత ఉంటుంది. ప్రస్తుతం ఎంతోమంది పదో తరగతి అర్హత లేకున్నప్పటికీ పోటీ చేసేందుకు సిద్ధమవగా వారందరి ఆశలపై నీళ్లు చలినట్లయింది. అయితే సర్పంచ్ ఎన్నికలకు మరో రెండు నెలలు గడువు ఉన్నట్లు సమాచారం ఉండగా ఆలోపు ఎలాగైనా పదో తరగతి విద్యను పూర్తి చేసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైతం కొంతమంది సిద్ధమవుతున్నారు. ఇందులో ఎక్కువమంది తెలంగాణ ఓపెన్ సెకండరీ స్కూల్ బోర్డు (టాస్ బోర్డు) నుంచి పరీక్షలకు హాజరయ్యేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఓపెన్ పరీక్షలు మే నెలలో ఉండగా జూన్, జూలై లో ఫలితాలు వెలువరించే అవకాశాలున్నాయి. ఈ పరీక్షలకు హాజరు కావాలంటే ఈనెల 7న ఆఖరు తేదీ ఉంది. మరో రెండు రోజుల్లో గడువు పూర్తి అవుతుండడంతో ఎంతోమంది పరీక్ష రాయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ సమయం సరిపోకపోవడంతో ఎంతోమంది సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి దూరమయ్యే అవకాశాలున్నాయి. అయితే తెలంగాణ ఓపెన్ సెకండరీ స్కూల్ బోర్డు (టాస్ బోర్డు) ఉన్నతాధికారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పరీక్షకు ఫీజు చెల్లించే గడువును మరో పక్షం రోజులు పెంచితే బాగుంటుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గడువు పెంచితే ఎంతోమంది నిరక్షరాస్యులు ఓపెన్ పద్ధతిలో పదోతరగతి పరీక్షకు హాజర్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుత రోజుల్లో సర్పంచ్ పదవి సైతం ఎంతో కీలకంగా ఉండడంతో ఈ పదవులకు పోటీ చేసే వారి సంఖ్య సైతం రోజురోజుకు పెరిగిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఓపెన్ పద్ధతిలో పదో తరగతికి పరీక్షకు హాజరయ్యే తుది గడువును మరో పక్షం రోజులు పెంచాలని పలువురు కోరుతున్నారు.

# మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ భద్రత ఏర్పాట్లు

– అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

– జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**వేములవాడ, మార్చి 6, (ప్రజాజ్యోతి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మార్చి 7 నుంచి మార్చి 9 వరకు 3 రోజుల పాటు మహా శివరాత్రి జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో వివిధ రాష్ట్రల నుండి,దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు భద్రత పరంగా ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా 1400 మంది పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని, జాతర ప్రాంగణ మొత్తం సీసీ కెమెరాలు ఆధీనంలో ఉండేలా చూడాలని,అన్ని శాఖల అధికారులు సిబ్బంది ,ఇతర జిల్లా నుండి వచ్చిన అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సారి భక్తుల రద్దీ పెరిగే నేపథ్యంలో 8 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడం జరిగిందని , జాతర వచ్చే వాహనాలు పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ చేసే విదంగా చర్యలు తీసుకువడం జరిగిందని దానికి అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ నిర్వహణ జాతర సమయంలో ప్రథమ స్థానంలో ఉంటుందని,గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా దానికి అనుగుణంగా సిబ్బందిని కేటాయించి పకడ్బందీ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీలు చంద్రశేఖర్ రెడ్డి, నాగేంద్రచారి, గంగాధర్, సిఐలు ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.